
ఆంధ్రజ్యోతి

గుంటూరు జిల్లా వార్తలు
5
శుక్రవారం 21 ఫిబ్రవరి 2025

రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రవేశపెట్టిన దీపం- 2 పథకం ప్రయోజనం జిల్లాలో అంతంతమాత్రంగానే కనిపిస్తోంది. కిందటేడాది అక్టోబరు 31, దీపావళి రోజున రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. పథకం ప్రవేశ పెట్టి నాలుగు నెలలవుతున్నా ఇప్పటి వరకూ మూడింట రెండోవంతు మందికి మాత్రమే ఉచిత సిలిండర్లు అందాయి. మరో నెలరోజుల్లో గడువు పూర్తి కానున్న నేపథ్యంలో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది.

దీపం-2కు సాంకేతిక చిక్కులు

- మూడు జిల్లాల్లో 17లక్షల రేషన్ కార్డులు
- ఇప్పటి వరకూ 12 లక్షల మందికే రాయితీ
- మరో నెలరోజుల్లో ముగుస్తున్న తొలి విడత గడువు




రేషన్ కార్డులు లేక.. రెండు లక్షలమందికి అనర్హత

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గుంటూరుజిల్లాలో 5,85,942 రేషన్‌కార్డులు కలిగి ఉన్న లబ్ధిదారులు దీపం- 2 పథకానికి అర్హత సాధించగా, ఇప్పటి వరకూ 3,97,000 మంది మాత్రమే ఉచిత గ్యాస్ సిలిండర్ తీసుకున్నారు. వారిలో 3,95,000 మందికి మాత్రమే గ్యాసు సిలిండర్ డబ్బు అందింది. కాగా ఇంకా లక్షా 90వేల మందికి ఉచిత సిలిండరు పథకం ప్రయోజనం అందలేదు. బాపట్ల జిల్లాలో 4,86,029 రేషన్ కార్డులు ఉండగా వారిలో 4,58,000 మందికి గ్యాసు కనెక్షన్లు ఉన్నాయి. వారిలో ఇప్పటి వరకూ 3,53,461 మందికి మాత్రమే ఉచిత గ్యాస్ సిలిండర్లు అందాయి. కాగా లక్షా 4వేల 539 మందికి ఇంకా ఈ పథకం దక్కలేదు. పల్నాడు జిల్లాలో 6,45,110 రేషన్ కార్డులు ఉండగా అందులో 4లక్షల మంది మాత్రమే ఇప్పటి వరకూ ఉచిత గ్యాసు సిలిండర్ పొందారు. మిగిలిన రెండున్నర లక్షల మందికి ఇంకా ఉచిత సిలిండర్ దక్కలేదు. నాలుగు నెలల్లో కేవలం 12 లక్షలమందికి మాత్రమే ఉచిత సిలిండర్ అందగా, మరో 38 రోజుల్లో ఐదు లక్షల మందికి ఉచిత సిలిండర్లు అందాల్సి ఉంది. ఇంత తక్కువ సమయంలో అంత ఎక్కువ మందికి అవకాశం లభిస్తుందా లేదా అన్నదే సగటు వినియోగదారుణ్ణి వెంటాడుతున్న ప్రశ్న. దీంతో వారు ఆందోళనకు గురవుతున్నారు.

● రేషన్ కార్డులు లేక 2 లక్షల మందికి అనర్హత

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మొత్తం 19.5 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, రేషన్ కార్డులు మాత్రం 17.31లక్షలు మాత్రమే వున్నాయి. పై గణాంకాల ప్రకారం జిల్లాలో 2.19 లక్షల గ్యాస్ కనెక్షన్లకు రేషన్ కార్డులు లేవు. దీంతో వారంతా ఈ పథకానికి అనర్హులు అయ్యారు. గత వైసీపీ ప్రభుత్వం కొత్తగా రేషన్‌కార్డులు ఇచ్చిన దాఖలాలు లేవు. పాత రేషన్ కార్డులను విభజించడంగానీ, మార్పు చేర్పులు చేయడంగానీ లేకపోవడంతో ఐదేళ్లుగా వారికి రేషన్ కార్డులు రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఇప్పటికి 8 నెలలు పూర్తవుతున్నా ఈరోజు వరకూ వారికి రేషన్ కార్డుల ఊసే లేకుండా పోయింది. అన్ని పథకాలకు ప్రామాణికమైన రేషన్ కార్డు లేకపోవడంతో జిల్లాలో రెండు లక్షల మందికి లేవు దీంతో దాదాపు రెండున్నర లక్షల మంది అనర్హత బారిన పడ్డారు. వీరంతా రేషన్ కార్డు నిబంధనను తొలగించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. దాంతో వారంతా ఆశలు వదిలేసుకున్నారు. అయితే ఇప్పుడు అర్హులైనవారిని కూడా సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి.



● సాంకేతిక చిక్కులు..

బ్యాంకు ఖాతాతో ఆధార్ అనుసంధానం కాకపోవడం, లబ్ధిదారునికి రెండు మూడు బ్యాంకుల్లో ఖాతాలుండడం, గ్యాస్ కనక్షన్‌కు ఇచ్చే ఖాతా నంబర్‌తో ఈకేవైసీ పూర్తి కాకపోవడంతో చాలా మంది రాయితీకి దూరమ వుతున్నారు. ఒక కుటుంబంలో గ్యాస్ కనెక్షన్ ఒకరి పేరున ఉంటుంది.. సిలిండర్ వినియో గించే వారు మరొకరు ఉంటారు. కనెక్షన్ ఉన్నవారికే గ్యాస్ సొమ్ము వాపస్ వస్తుంది. ఈ తరహా సమ స్యలతో అనేకమంది ఉచిత సిలిం డర్ ప్రయోజనం కోల్పోతున్నారు.

● కాల్ సెంటర్ల ఏర్పాటు..

ఉచిత సిలిండర్ డబ్బులు పడకపోతే వివరాలు తెలుసుకోవడానికి అన్ని పౌర సరఫరాల శాఖ కార్యాలయాల్లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. ఆధార్, గ్యాస్ కనెక్షన్ నంబర్ చెబితే సరిపోతుంది. అలా రాలేనివారు 1967 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి తమ సమస్యను చెబితే వారు సంబంధిత అధికారు లకు సమస్యను తీసుకువెళ్లి పరిష్కారం చూపే అవకాశం ఉంటుంది. ఆ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు లబ్ధిదారులకు సూచిస్తున్నారు.



- పీఎం స్వానిధి పేరుతో క్రెడిట్ కార్డులు
- ఇటీవల బడ్జెట్లో అదనపు కేటాయింపులు
- రుణ పరిమితి 50,000ల వరకు పెంపు
- తీరనున్న అధిక వడ్డీ కష్టాలు
- మూడు జిల్లాల పరిధిలో 60,000 మంది వరకు లబ్ధి

చిరు వ్యాపారులకు ఊరట!

పట్టణాల్లో వీధి వ్యాపారులు పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వాటిని తీర్చే మార్గం తెలియక ఎన్నో ఇక్కట్లు ఎదుర్కొనేవారు. వీటి నుంచి వారిని బయటపడేయడానికి కేంద్రం పీఎం స్వానిధి పేరుతో క్రెడిట్ కార్డులు మంజూరు చేసే విధంగా ప్రణాళికలు రచిస్తోంది. గతంలో చిరు వ్యాపారులకు పీఎం స్వానిధి పేరిట తొలి విడతలో పదివేల రుణాన్ని కేంద్రం మంజూరు చేసింది. మెప్మా వద్ద నమోదు అయిన వీధి వ్యాపారులకు దీనిని వర్తింప చేసింది. తాజాగా కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో రుణపరిమితిని రూ.30,000, 50,000కు పెంచి దశల వారీగా వీధి వ్యాపారులకు అందిస్తామని కేంద్రం ప్రకటించడం చిరు వ్యాపారులకు ఊరట నిచ్చింది. ఎండనక వాననక వ్యాపారం చేసి సంపాదించిన డబ్బు వడ్డీల రూపంలో వెళ్లిపోయేదని, ఇప్పుడు వడ్డీ లేకుండా కేంద్రం రుణాలు ఇవ్వడం పట్ల చిరు వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పీఎం స్వానిధి పథకం కింద బాపట్ల జిల్లాలో 12,000 మంది పట్టణ వీధి వ్యాపారులకు ఈ పథకం కింద లబ్ధి చేకూరనుండగా, పల్నాడు జిల్లాలో 15,000, గుంటూరు జిల్లాలో 33,000 మంది వీధి వ్యాపారులకు పీఎం స్వానిధి క్రెడిట్ కార్డులు అందనున్నాయి. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రక్రియ మొదల యింది. గతంలో పదివేల రుణం తీసుకుని సకాలంలో కట్టిన వారంతా తర్వాత దశలో భాగంగా 30,000 రుణం పొందే క్రెడిట్‌కార్డు అర్హత సాధించారు. ఈ కేటగిరిలో కూడా ఇప్పటికే దాదాపు 25,000 మంది వడ్డీలేని రుణాలు తీసుకోనున్నారు. తర్వాత దశలో చిరు వ్యాపారులకు రూ.50,000 వరకు వడ్డీలేని రుణాలు అందించనున్నారు

కుదేలయిన చిరు వ్యాపారాలను గాడిలో పెట్టడానికి...

గత ప్రభుత్వంలోనే కేంద్రం పదివేల రుణ సహాయాన్ని వడ్డీలేకుండా వీధి వ్యాపారులకు అందించింది. కానీ ఈ నిధులను సైతం పక్కదారి పట్టించి అర్హులైన లబ్ధిదారులకు ఫలాలు అందకుండా చేసిన ఘనతను వైసీపీ మూటగట్టుకుంది. పైగా ఆ రుణాలను కూడా ఇష్టారీతిన అనర్హులకు దోచిపెట్టినట్లు అనేక ఆరోపణలు వచ్చాయి. దీంతో చిరు వ్యాపారులు అధిక వడ్డీల కోసం దళారులను ఆశ్రయించాల్సి రావడంతో ఆర్థికంగా వారంతా చితికిపోయారు. దీనికి తోడు స్థానికంగా ఉండే నేతలకు జే ట్యాక్స్ కట్టలేక అసలు వ్యాపారాలనే మానేసిన వారు ఉన్నారు. అన్ని విధాలుగా వీధి వ్యాపారులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం పీఎం స్వానిధి పేరిట రుణ సహాయం చేయడానికి పూనుకుంది

కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా...

వీధి వ్యాపారులు నేరుగా పీఎం స్వానిధి పోర్టల్‌లో కాని వారికి దగ్గరలో ఉన్న సీఎస్‌సీ లద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించే చిరు వ్యాపారులకు కేంద్రం ప్రోత్సాహకాలు కూడా అందిస్తుంది. దీనిలో భాగంగా 7 శాతం వరకు సబ్సిడీతో పాటు ఏడాదికి రూ.1,200 వరకు క్యాష్ బ్యాక్‌ను కూడా అందిస్తుంది. తీసుకున్న రుణాలపై ఎలాంటి అదనపు చార్జీల వడ్డన లేకపోవడంతో పాటు రుణాన్ని ముగించేటప్పుడు ఎలాంటి చార్జీలను వసూలు చేయకుండా వారి ప్రయోజనాలను కేంద్రం కాపాడుతోంది

పారదర్శకంగానే లబ్ధిదారుల ఎంపిక

వడ్డీలేని రుణాలను అందుకునే అర్హులైన వీధి వ్యాపారులను ఎంపిక చేసే ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని చర్యలు తీసుకున్నాయి. పీఎం స్వానిధికి అర్హత సాధించాలంటే సదరు వీధి వ్యాపారి పేరు మెప్మా విభాగం వద్ద రిజిష్టర్ అయి ఉండాలి. ఇందుకోసం గతంలోనే సిబ్బంది ఫీల్డ్ విజిట్ చేసి పేర్లు నమోదు చేసుకున్నారు. అర్హత ఉండి రుణం అందుకోని వారికి నేరు గా కార్యాల యంలో దరఖాస్తు చేసుకునే వెసు లుబాటును కూడా మెప్మా కల్పించింది.

గతంలో జరిగిన సర్వేపై పలు అనుమానాలు

కరోనా కారణంగా దెబ్బతిన్న చిరు వ్యాపారులను ఆదుకునేందుకు కేంద్రం ఆసమయంలో వారిని ఆదుకునేందుకు పదివేల రూపాయల రుణ సాయాన్ని వడ్డీలేకుండా అందించాలనే నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు అదే రుణాన్ని 50,000 వరకు పెంచే విధంగా తాజా బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించింది. కరోనా సమయంలో వీధి వ్యాపారుల లెక్క తేల్చే బాధ్యతను మెప్మాకు ప్రభుత్వాలు అప్పజెప్పాయి. వైసీపీ ప్రభు త్వంలో మితిమీరిన రాజకీయ జోక్యంతో ఈ జాబితా అంతా కూడా నేతల అనుచరగణం తోనే నిండిపోయిందని, అర్హత కలిగిన వీధి వ్యాపారులు 60 శాతానికి మించి ఉండరనే ఆరోపణలు గతంలోనే వచ్చాయి. కానీ గత ప్రభుత్వంలో ఆ జాబితా ఆధారంగానే రుణాలు అందించారు. ప్రస్తుతం కూడా అదే ప్రామాణి కంగా పరిమితి పెంచి మరీ క్రెడిట్ కార్డులు అందించడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. మొత్తం జాబితాను జల్లెడ పడితే వీధి వ్యాపా రులు కాని ఎంతోమంది రుణాలు అందుకుం టున్న వైనం వెలుగులోకి వస్తుందనేది అర్హులైన వారి వాదనగా ఉంది. పారదర్శకంగా సర్వే చేయడం వలన అనర్హులు తొలగించబడతారని, తద్వారా అర్హులైన మరి కొంత మందికి ఈ పీఎం స్వానిధి ఫలాలు అందుతాయని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సత్తెనపల్లి పోలీసులను అభినందించిన హోం మినిస్టర్

సత్తెనపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పోలీసులను హోం మినిస్టర్ వంగలపూడి అనిత గురువారం ఫోన్‌లో అభినందించారు. ఎన్‌టీఆర్ జిల్లా గన్నవరంలో ఒక ప్రముఖ కళాశాలలో చదివే ఐదుగురు మైనర్ విద్యార్థినులు మిస్సింగ్ అయ్యారని బుధవారం సాయంత్రం గన్నవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఆ ఫిర్యాదు మేరకు పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఉత్తర్వుల మేరకు సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, సీఐ బ్రహ్మయ్య, ఎస్ఐ సంధ్యారాణి, ఏఎస్ఐ రమణ తమ సిబ్బందితో బుధవారం అర్ధరాత్రి వరకు విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న రైళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ట్రెయిన్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురు విద్యార్థినులను గుర్తించి చాకచక్యంగా పట్టుకొని వారిని సత్తెనపల్లి రైల్వే స్టేషన్‌లో దించి వేశారు. అనంతరం గన్నవరం పోలీసులకు సమాచారం అందించి ఐదుగురు విద్యార్థినులను వారి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ విషయంలో రాష్ట్ర హోం మినిస్టర్ సత్తెనపల్లి పోలీసులకు ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత కట్టుదిట్టం

- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

ఏడాదిలో హైవే నిర్మాణ పనులు పూర్తి

- ఎన్‌హెచ్‌ఏఐ రీజనల్ ఆఫీసర్ ఆర్‌కే సింగ్

8

పోలింగ్ సిబ్బందికి సామగ్రిని సక్రమంగా అందించండి

- ఆర్‌వో నాగలక్ష్మి ఆదేశాలు


గుంటూరు : ఏసీ కళాశాలలో రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన జేసీ భార్గవ్ తేజ్

8

రికార్డు స్థాయిలో పత్తి కొనుగోళ్లు

- 44 వేల మంది రైతుల నుంచి 20 లక్షల క్వింటాళ్లు
- పదేళ్ల తర్వాత రాష్ట్రంలో సీసీఐ కొత్త రికార్డు
- సీఎం యాప్‌తో అక్రమాలకు చెక్

3

- ఉమ్మడి జిల్లాకు రూ.85 కోట్లు
- 4.26 లక్షల మంది రైతులకు లబ్ధి

కిసాన్ యోజన... డబ్బులొస్తున్నాయ్

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ యోజన పథకం కింద ఉమ్మడి గుంటూరు జిల్లాకు రూ.85 కోట్లు రానున్నాయి. రైతులకు పెట్టుబడి భరోసా కల్పించటంతో పాటు, ఇతర అవసరాల కోసం కేంద్రం పీఎం కిసాన్ పథకం కింద ప్రతి ఏటా రూ. ఆరు వేలు విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. మూడు వాయిదాలలో ఈ నగదు నేరుగా రైతుల ఖాతాలో జమ చేయటం జరుగుతుంది. 2024-2025 సంవత్సరానికి మూడో వాయిదా సొమ్మును 24వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదగా విడుదల చేయనున్నారు. ఈ పథకం కింద గుంటూరు జిల్లాలో 86 వేల మంది, పల్నాడు జిల్లాలో 1.98 లక్షల మంది, బాపట్ల జిల్లాలో 1.42 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లాకు 17.27 కోట్లు, పల్నాడు జిల్లాకు 39.63 కోట్లు, బాపట్ల జిల్లాకు రూ.28.45 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి.

లబ్ధిదారుల వడపోత..

వాస్తవానికి పీఎం కిసాన్ యోజన కింద లబ్ధి పొందే వారి సంఖ్య చాలా ఎక్కువగా వుండేది. 2019లో ప్రారంభం అయిన ఈ పథకంలో కొంత మంది అనర్హులు కూడా లబ్ధి పొందుతున్నట్లు కేంద్రా నికి ఫిర్యాదులు వెళ్లాయి. పొలం అమ్ముకున్న వ్యక్తులు, మరణించిన వారు, విదేశాల్లో ఉంటున్న వారు, ఆదాయపు పన్ను చెల్లించే వారు ఇలా అనేక రకాలుగా అనర్హులకు పీఎం కిసాన్ అందుతున్నట్లు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఆ విచారణలో ప్రభుత్వం భావించినట్లే చాలా మంది అనర్హులను గుర్తించారు. ఉదాహరణకు గుంటూరు జిల్లాలో గతంలో 1,21,898 మంది పీఎం కిసాన్ యోజన కింద లబ్ధి పొందే వాళ్ళు. విచారణ జరిపిన తర్వాత ఆ సంఖ్య 86 వేలకు పరిమితం అయ్యింది. అధికారులు చేపట్టిన విచారణలో 33,889 మంది అనర్హులు ఉన్నట్లు తేలింది. వారిలో 465 మంది ఎన్నారైలు, 3799 మంది ఒకరికంటే ఎక్కువ మంది లబ్ధి పొందేవాళ్ళు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు, ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన 477 మంది, 2019 నాటికే పొలం అమ్ముకొన్నవాళ్ళు 5866 మంది, స్థిరమైన భూ యాజమాన్య హక్కులు లేకుండా పథకంలో లబ్ధి పొందిన వాళ్ళు 12747 మంది, గుర్తు తెలియని, చిరునామా లేని వ్యక్తులు 7247 మంది, ఆదాయపు పన్ను చెల్లిస్తూ ఈ పథకం కింద లబ్ధి పొందిన వారు 2325 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించి వారిని తొలగించారు.



తీరనున్న సాగునీటి వెతలు


ప్రారంభోత్సవానికి సిద్ధమైన పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్ ఎత్తిపోతల పథకం

- ప్రారంభానికి సిద్ధమైన పెదవడ్లపూడి ఎత్తిపోతల పథకం
- వైసీపీ హయాంలో నిలిపివేత
- పట్టుదలగా నిధులిచ్చి పూర్తి చేయించిన లోకేశ్
- వచ్చే నెలలో ప్రారంభోత్సవానికి సన్నాహాలు
- 25,344 ఎకరాలకు సాగునీటి లభ్యత

1937లో ఏర్పాటు చేసిన ఓ హైలెవల్ ఛానల్. అప్పట్లో దీనికి నంబూరు హైలెవల్ ఛానల్‌గా నామకరణం చేశారు. బకింగ్‌హామ్ కాలువ కన్నా హైలెవల్ ఛానల్ ఒకటిన్నర మీటరు ఎత్తులో ఉంది. దీంతో రబీలో కాలువలో నీటి ప్రవాహం చాలా తక్కువగా ఉన్న సమయంలో హైలెవల్ ఛానల్ కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరందక పైర్లు ఎండిపోతున్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ క్రమంలో టీడీపీ ప్రభుత్వం 2018లో ఈ సమస్యపై దృష్టి పెట్టింది. సుమారు రూ.14.88 కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పనులను చేపట్టింది. 2019 ఎన్నికల నాటికి సుమారు రూ.9 కోట్లతో దాదాపు 70 శాతం పనులను పూర్తి చేసింది. అయితే 2019 ఎన్నికల్లో అధికారం చేపట్టిన వైసీపీ పథకం పనులు పూర్తిగా నిలిపేసింది. గత ఎన్నికల సమయంలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు సుమారు రూ.15 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేయించారు. మార్చి నెలలో ప్రారంభించనున్న ఈ పథకంతో 25,344 ఎకరాలకు పుష్కలంగా సాగునీరు అందనుంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

8

అమరేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి సుభాష్



అమరేశ్వరాలయ స్నానఘాట్ వద్ద మంత్రి సుభాష్

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం ఉదయం సందర్శించారు. శివమాల ధరించిన సుభాష్ తన సహచరులతో కలసి ఆలయాన్ని సందర్శించగా అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివార్లకు మంత్రి సుభాష్ పేరుమీద పూజలు నిర్వహించి ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పరమేశ్వరుని ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి చెందాలని, పేదలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగాలని కోరుకున్నట్లు సుభాష్ తెలిపారు.

నేటి నుంచి మాస్టర్స్ వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలు

తాడేపల్లి (ప్రాతూరు కట్ట), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, స్పాన్సర్ విజయవాడ క్లబ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 21 నుంచి 25 వరకు విజయవాడ క్లబ్‌లో ఏపీ స్టేట్ మాస్టర్స్ వెటరన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయని క్లబ్ అధ్యక్షుడు ఎంఎస్ చౌదరి, కార్యదర్శి పెరవలి చంద్రశేఖరరావు (చంద్రం) తెలిపారు. పురుషుల, సింగిల్స్, మహిళల సింగిల్స్, పురుషుల డబుల్స్ మహిళల డబుల్స్ మిక్సడ్ డబుల్స్‌లో పోటీలుంటాయన్నారు. 35 ఏళ్ల నుంచి 75 ఏళ్ల వారి వరకు అవకాశం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 300 మంది క్రీడాకారులు రానున్నారని, క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు ఫిబ్రవరి 21 ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. మెయిన్ డ్రా మ్యాచ్‌లు మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతాయని, ఫిబ్రవరి 21 సాయంత్రం 4 గంటలకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార ప్రసార శాఖల మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభిస్తారన్నారు. చలసాని విజయకుమార్, ఇ.బుచ్చిబాబు, విజయవాడ క్లబ్‌లోని బ్యాడ్మింటన్ క్రీడాకారులు యాజమాన్యం, స్పాన్సర్ షిప్ ప్రతినిధులుగా ఉన్నారని చెప్పారు. పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

ప్రతి ఓటూ ప్రధానమే..

● రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, పక్కన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, మన్నవ మోహన కృష్ణ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పోటీలో ఉన్న ప్రత్యర్థి అభ్యర్థి ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద నిలబెట్టిన నాటి ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. గురువారం నరసరావుపేట నియోజవర్గ టీడీపీ కార్యాలయంలో ఉమ్మడి గుంటూరు-కృష్ణ జిల్లాల ఎమ్మెల్సీ సంబంధించి కూటమి ఆలపాటి రాజేంద్రప్రసాదుకు మద్దతుగా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ ప్రతి ఓటూ ప్రధానమే అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 63 నుంచి 64 లక్షల పెన్షన్లు ఇస్తున్నామన్నారు. పెన్షన్ రూ.3 వేల నుంచి రూ.4 వేలు చేశామని, వికలాంగులకు రూ.6 వేలు చేశామని, పూర్తి వికలాంగత్వంతో ఇబ్బంది పడుతుంటే రూ.15 వేలు చేశామన్నారు. దాదాపు దేశంలో ఎక్కడా లేనివిధంగా పెన్షన్లు ఇస్తున్నామన్నారు. హామీ మేరకు గ్యాస్ ఉచితంగా అందజేస్తున్నామని, నరసరావుపేటలో మూడు అన్న క్యాంటీన్లు ప్రారంభించామని చెప్పారు. వచ్చిన ప్రతి పథకం కూడా ప్రజలకు అందించే దాట్లో కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికను కూడా దీటుగా ఎదుర్కోవాలన్నారు. గత ఐదు సంవత్సరాలలో ఒక్కసారి అధికారం కోల్పోతే పార్టీ నష్టపోవడమే కాకుండా, కార్యకర్తలు, రాష్ట్రం కూడా ఎంత పెద్దఎత్తున నష్టపోయిందో రాష్ట్ర ప్రజలు అందరికీ తెలుసన్నారు. వ్యవస్థలు అన్ని దుర్వినియోగం చేశారనీ, ఇవాళ ఒక పని మధ్యలో వదిలేస్తే మళ్లీ కట్టాలంటే రూపాయి ఖర్చు అయ్యేది రూపాయిన్నర ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు డయాఫ్రమ్ వాల్ రూ.400 కోట్లు అయ్యేది గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం వలన మొత్తం డ్యామేజీ అయిందన్నారు. మళ్లీ కట్టాలంటే రూ.వేయి కోట్లు అవుతుందన్నారు. ఇది అంతా ప్రజల సొమ్ము అని, భారంగా మళ్లీ ప్రజల మీదపడుతుందన్నారు. గత ఐదేళ్లలో విద్యుత్ చార్జీలు తొమ్మిది సార్లు పెంచారని అన్నారు. ప్రతి ఓటరుతో మాట్లాడాలన్నారు, ప్రతి ఒక్కరి ఓటు ప్రధానమైనదేనని, అలసత్వం ప్రదర్శించకుండా కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదును గెలిపించాలన్నారు. నియోజవర్గ పరిశీలకుడు మన్నవ మోహన కృష్ణ మాట్లాడుతూ సమయం కేవలం ఐదు రోజులే ఉందన్నారు. ఈ ఎన్నికల చాలకీలకమైనదని, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి ఎన్నికన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాదు కాదు చంద్రబాబునాయుడు పోటీ చేస్తున్నారని భావించి కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. ఓటర్లకు ఎలా ఓటు వేయాలనే విషయంలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కడియాల రమేష్‌బాబు, గొట్టిపాటి జనార్ధనబాబు, కనుమూరి లక్ష్మీ, కదం నాగజ్యోతి, జనసేన వీర మహిళ మిరియాల వెంకట సుబ్బమ్మ, షేక్ మాబు, తదితరులు పాల్గొన్నారు. సభకు గూడూరుశేఖర్ అధ్యక్షత వహించారు.

పోలీసుల అదుపులో గంజాయి ముఠా



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు, సీఐ మల్లికార్జునరావు

తెనాలి క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తుకి అలవాటు పడటమే కాక వాటి అమ్మకాలు సాగిస్తున్న ఆరుగురి ముఠా సభ్యులను తెనాలి వన్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో గంజాయి ముఠా వివరాలను డీఎస్పీ బి.జనార్ధనరావు వెల్లడించారు. కొల్లిపర మండలం, వల్లభాపురంకు చెందిన ఆరుమళ్ల సాహిత్‌రెడ్డి (25), రెడ్డిబత్తుల హర్షవర్ధన్‌రెడ్డి (28), పాముల రిషి బాబు (25), తెనాలి రామలింగేశ్వరపేట తోటవారి వీధి-2కు చెందిన యర్రమోతు పవన్ ప్రశాంత్ (20), పట్టణంలోని నాజరుపేట తిరుపతమ్మ తల్లి రోడ్డు ప్రాంత నివాసి పసుపులేటి వెంకటేశ్వరరావు (23), గంగానమ్మపేట గోపాల్‌రెడ్డి వీధికి చెందిన వెలగొందుల రమేష్ (18) కొంతకాలంగా గంజాయి మత్తుకు బానిసలై ఆదాయం కోసం గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లు చేసి రూ.500, రూ.700లకు అమ్మకాలు సాగిస్తున్నారు. వీరిలో ఆరుమళ్ల సాహిత్‌రెడ్డి గంజాయి కేసులో 2021లో జైలుశిక్ష అనుభవించాడు. ఇతని నాయకత్వంలోని ముఠా సభ్యులు ఒడిశాలోని బీదా గ్రామం నుంచి గంజాయి కొనుగోలు చేసి దానిని ఒంటి మీద దుస్తులలోనే దాచి రైలు మార్గం ద్వారా విజయవాడ చేరుకుంటారు. విజయవాడ నుంచి స్వగ్రామం వల్లభాపురం చేరుకుంటారు. తెనాలి, మంగళగిరి ప్రాంతాలలో ఉన్న కష్టమర్లకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కాల్ చేసి నిర్ణీత ప్రాంతంలో వారికి అందిస్తున్నారు. గురువారం ఉదయం ఈ ముఠా పట్టణంలోని వైకుంఠపురం రైల్వే అండర్‌పాస్ వద్ద ఉన్న సమాచారంతో సీఐ మల్లికార్జునరావు పర్యవేక్షణలో వారిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. ఈ ముఠా సభ్యుల విచారణలో పట్టణంలోని మరో 10 మంది గంజాయి వినియోగదారులు, మంగళగిరి ప్రాంతంలో మరో 50-60 మంది వినియోగదారులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. పోలీసుల నిఘా పెరిగిపోవడంతో వారు ఇన్‌స్టాగ్రామ్, ఇతర సాంకేతిక విధానాల ద్వారా కష్టమర్లకు గంజాయి చేరవేస్తున్నారు. వీరి గంజాయి కష్టమర్లని కూడా గుర్తించామని త్వరలోనే వారిని అదుపులోకి తీసుకుంటామన్నారు. ముఠాని అదుపులోకి తీసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ మల్లికార్జునరావును సిబ్బందిని ఎస్పీ వి.సతీష్‌కుమార్ అభినందించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

పంటకాల్వలో అనుమానాస్పదంగా మృతదేహం

ముప్పాళ్ళ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోళ్లపాడు శివారు తురకపాలెం డొంకరోడ్డులోని పంటకాల్వలో అనుమానాస్పదంగా పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు గురువారం పోలీసులకు తెలియజేశారు. మృతి చెందిన వ్యక్తి తురకపాలెం గ్రామానికి చెందిన మక్కెన ఇన్నయ్య(45)గా గుర్తించారు. మృతుడు బుధవారం రాత్రి 9 గంటల వరకూ గ్రామంలోనే ఉన్నాడని మృతుని భార్య లక్ష్మీపార్వతి పోలీసులకు చెప్పినట్లు సమాచారం. ఇన్నయ్య మద్యం తాగి కుటుంబ సభ్యులపై గొడవ పడుతుంటాడని, బుధవారం కూడా గొడవపడి బయటకు వెళ్లాడని తెలిపారు. అనంతరం అనుమానాస్పదంగా మృతదేహం పంటకాల్వలో కన్పించింది. మృతుని ముఖం, తలపై గాయాలున్నాయి. సంఘటనా స్థలాన్ని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య లక్ష్మీపార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చమళ్ళమూడిలో కౌలు రైతు ఆత్మహత్య

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చమళ్ళమూడి గ్రామానికి చెందిన కౌలు రైతు షేక్ మౌలాలి(50)కి అప్పులు పెరగటంతో, తీర్చే దారిలేక బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య మస్తాన్‌బీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడు మౌలాలి గత కొన్ని సంవత్సరాలుగా రెండు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేస్తున్నాడు. గత రెండు సంవత్సరాలుగా మిర్చి సాగు తెగుళ్లతో దిగుబడులు రాకపోవటం, వచ్చినా ధర లేక పోవటంతో అప్పుల భారం పెరిగింది. దాదాపు రూ. 6 లక్షలమేర అప్పులు అయ్యాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చగా గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు.

బస్సు.. బైకు ఢీ: యువకుడు మృతి

చెరుకుపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి మండలం కావూరు బస్టాండ్ వద్ద బస్సు, బైక్ ఢీకొనటంతో ఒకరు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వేరే వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ వస్తున్న బస్సు ఎదురుగా వస్తున్న బైకును ఢీకొంది. పెదమట్లపూడికి చెందిన ఎ.దుర్గాప్రసాద్(25) మిపపనారు నిమిత్తం బాపట్ల వెళ్లి వస్తుండగా కావూరు బస్టాండ్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని రేపల్లె ఏరియా వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన మరొక వ్యక్తిని తెనాలి ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	87, 99, 108
చికెన్ విత్ స్కిన్	172.00
చికెన్ స్కిన్ లెస్	182.00

పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

చెరుకుపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బుధవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు చెరుకుపల్లి మండలం ఆరుంబాకలో గల భువనశ్రీ ఫర్టిలైజర్స్ గుప్తా ట్రేడర్స్ ఎరువులు పురుగు మందుల దుకాణాలపై జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ డి.సూర్యశ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు అధికారులు, మండల వ్యవసాయ అధికారి సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడులలో పెద్ద ఎత్తున ఎరువుల స్టాక్ వ్యత్యాసాలను గుర్తించారు. కాలపరిమితి దాటిపోయిన పురుగుమందులను సీజ్ చేశారు. సరైన అనుమతి పత్రాలు లేకుండా అమ్మకాలు జరపకుండా నిలుపుదల చేసిన సదరు షాపులపై చట్టపరమైన చర్యలు చేపట్టాల్సిందిగా మండల వ్యవసాయాధికారికి ఆదేశాలు జారీ చేశారు. ఈ దాడులలో మొత్తంగా రూ. 15,68,712 విలువ గల స్టాక్ వ్యత్యాసానికి రెండు 6ఏ కేసులు నమోదు చేశారు. సరైన అనుమతుల్లేని బయోపురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశారు. కాలపరిమితి దాటిన రూ. 1,13,650 విలువల పురుగు మందులను సీజ్ చేశారు. ఈ దాడులలో జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి చెందిన వ్యవసాయాధికారి సీహెచ్ ఆదినారాయణ, సీఐలు కె.చంద్రశేఖర్, పి.శివాజీ వారి సిబ్బంది మండల వ్యవసాయ అధికారి ఎ.మహేష్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

జగన్ పరామర్శలో రౌడీలు తప్ప రైతులు లేరు: కనపర్తి


కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చియార్డు వద్ద జగన్మోహనరెడ్డి చేపట్టిన రైతుల పరామర్శలో రౌడీలు, గంజాయి గుంపు తప్ప రైతులు ఎవరూ లేరని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ వెంట ఉన్న బూతుల సామ్రాట్ కొడాలి నాని, అవినీతికి, అనైతికతకు మారుపేరైన అంబటి రాంబాబు, పదవుల కోసం ఇతర పార్టీ కార్యాలయాలపై దాడులు, దహనాలకు పాల్పడే ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి.. వీరేనా రైతు నాయకులని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ ఉండగా ప్రభుత్వపరిధిలోని మిర్చియార్డులోకి దౌర్జన్యంగా ప్రవేశించటమే కాక రైతుల మిర్చిటిక్కీలను దొంగిలించడం ఏమిటని కనపర్తి నిలదీశారు. జగన్ ప్రభుత్వం మిర్చి ధరను నాడు ఏడు వేలుగా నిర్ణయించింది నిజం కాదా అని ప్రశ్నించారు. కేవలం అన్నం తినటానికి, అబద్ధాలు మాట్లాడటానికి మాత్రమే జగన్ నోరు తెరుస్తాడని కనపర్తి ఎద్దేవా చేశారు. రెండురోజులుగా జగన్ వ్యాఖ్యలను చూస్తుంటే ఆయన మానసిక పరిస్థితిపై సొంత పార్టీ నేతలే విస్తుపోతున్నారన్నారు.

● రైతు వ్యతిరేకి జగన్: కంచర్ల శివరామయ్య

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి రైతులకు కునుకులేకుండా చేసిన జగన్ రైతాంగ వ్యతిరేకి అని టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుల బోరుబావులకు స్మార్ట్‌మీటర్లు పెట్టి రైతుల నడ్డి విరవాలని చూసిన జగన్, మిర్చి రైతులకు రూ.7000 మద్దతు ధర నిర్ణయించి వ్యాపారులకు కొమ్ముకాశాడని గుర్తుచేశారు. రాజధాని అమరావతి రైతులకు కౌలు కూడా వేయకుండా ఐదేళ్లు రైతులను వేధించి నేడు రైతుల పరామర్శ అంటూ నాటకాలు ఆడితే ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు.

కౌలు రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలి

● లీడ్ బ్యాంకు అధికారులకు వినతి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కౌలురైతులకు తక్షణమే కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పీవీ జగన్నాథం అన్నారు. గురువారం జీటీ రోడ్డులోని లీడ్‌బ్యాంకు అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు ఎటువంటి ష్యూరిటీ లేకుండా రూ.2లక్షల వరకు పంటరుణాలు ఇవ్వాలన్నారు. గుర్తింపుకార్డులు లేని కౌలురైతులందరికీ కౌలుమిత్ర గ్రూపులు ఏర్పాటుచేసి పంట రుణాలు ఇవ్వాలని కోరారు. దేవదాయ, ధర్మాదాయ, వక్ఫ్ భూములు సాగుచేస్తున్న కౌలురైతులకు పంటరుణాలు ఇవ్వాలని, జిల్లాస్థాయిలో జరిగే సమీక్షల్లో కౌలు రైతులను, కౌలు రైతు సంఘాల ప్రతినిధులను భాగస్వాములు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో కంజుల విఠల్ రెడ్డి, పచ్చల శివాజీ తదితరులు ఉన్నారు.

డాక్టర్ ఎన్‌వీఎస్ చౌదరి సేవలు వెలకట్టలేనివి

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్‌గా, శస్త్రచికిత్స నిపుణులుగా, వైద్యబోధన నిపుణులుగా డాక్టర్ ఎన్‌వీ సుబ్బారావుచౌదరి అందించిన సేవలు వెలకట్టలేనివని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వీ కొనియాడారు. గురువారం శుశ్రుతహాల్‌లో జరిగిన డాక్టర్ ఎన్‌వీఎస్ చౌదరి సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత ఎన్‌వీఎస్ చౌదరి చిత్రపటానికి వైద్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణయశస్వీ, జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారిలు మాట్లాడుతూ శస్త్రచికిత్స నిపుణులుగా డాక్టర్ ఎన్‌వీఎస్ చౌదరి ఎందరో వైద్యవిద్యార్థులకు స్ఫూర్తినిచ్చారన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ ఉమాజ్యోతి, జీఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ సుధాకర్, ఎన్‌వీఎస్ చౌదరి కుమారుడు ఎన్నార్, డాక్టర్ ఎన్‌వీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక వేధింపులు

గుంటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : బాలికపై తండ్రి వరుసైన వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలిక తల్లితండ్రులు మనస్పర్థల కారణంగా విడిపోయి వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో బాలిక తల్లి వేరే వ్యక్తితో సహజీవనం చేస్తూ ఉండగా ఆవ్యక్తి బాలికతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, లైంగికంగా వేధిస్తున్నాడు. దీంతో బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. .

లాడ్జిలో తెనాలి యువకుడి ఆత్మహత్య

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అశ్విని లాడ్జిలో తెనాలికి చెందిన వి.రవితేజ (32) అని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవిజేత మూడు రోజుల క్రితం గది అద్దెకు తీసుకున్నాడు. రెండు రోజులుగా గది నుంచి బయటకు రాకపోవడంతో గురువారం లాడ్జి సిబ్బంది వెళ్లి పరిశీలించగా తలుపు తెరవలేదు. గది నుంచి దుర్వాసన వస్తుండడంతో లోపలికి వెళ్లి చూడగా మతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించండి

● జనసేన నేతలు బోనబోయిన, గాదె ప్రచారం


ఉపాధ్యాయులను కలిసి ప్రచారం చేస్తున్న బోనబోయిన, గాదె

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులకు విజ్ఞప్తిచేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ఏటీ అగ్రహారం, నేతాజీనగర్‌లో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను గురువారం కలిశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యర్రంశెట్టి పద్మావతి, సంకూరి శ్రీనివాసరావు, జనసేన నాయకుడు అడపా మాణిక్యాలరావు పాల్గొన్నారు.

జేకేసీలో ప్రారంభమైన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌స్కిల్ పోటీలు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశా లలో గురువారం రాష్ట్రస్థాయి సాఫ్ట్‌స్కిల్స్ పోటీలు ప్రారంభమయ్యా యి. పోటీలకు వివిధ కళాశాలల నుంచి 35 టీంలు పాల్గొన్నట్లు ప్రిన్సి పాల్ పి.గోపీచంద్ తెలిపారు. భాషా నైపుణ్యం, సామెతలు, భావ వ్యక్తీకరణ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో షేక్ అమీనాఖాన్, ఎండీ సుమయ్య అమీనా, ఎస్‌కే అసద్ అలీ, యశ్వంత్, పి.శివ, ఎస్‌కే ఆశిక్‌రోషన్ తదితరులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. శ్రీవిద్య, నేహా సాయి, అనూష, వి.రమ్య తదితరులు ప్రత్యేక బహుమతులు అందుకున్నారు. కార్యక్ర మంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే సాంబశివరావు, పీజీ కోర్సులు డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, కోఆర్డినేటర్ నాగసుశీల తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టాలి

● కలెక్టర్, ఎస్పీ ఆదేశాలు


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నార్కోటిక్ కో-ఆర్డినేషన్ కమిటీ(ఎన్‌సీవోఆర్‌డీ) జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు పర్యవేక్షణకు అంతర్గతంగా ప్రత్యేకంగా కమిటీలను 15 రోజుల్లో ఏర్పాటు చేసేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కమిటీలు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల దుష్పరిణామాలను వివరిస్తూ స్కూల్స్, కళాశాలలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. మత్తు పదార్థాలు అమ్మకాలు, వినియోగం సమాచారాన్ని తెలిపేందుకు 14405 టోల్ ఫ్రీ నంబరు గురించి విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. మాదక ద్రవ్యాలు రవాణను రవాణ జరగకుండా రవాణ శాఖ అధికారలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎస్పీ సతీష్ కుమర్ మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగించటానికి అనువుగా ఉన్న జనసంచారం లేని ప్రాంతాలను మండలాల వారీగా గుర్తించి పూర్తి స్థాయిలో నిఘా ఉంచి పర్యవేక్షిస్తున్నామన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలు వినియోగిస్తు పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యాసంస్థల ప్రాంగణాల్లో నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ కుమారి, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక, అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ లక్ష్మణ్, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ జిల్లా కో-ఆరినేటర్ విజయ్ ప్రకాష్, ఆచార్య నాగర్జున యూనివర్సిటీ ఓఎస్డీ రవికుమార్, ఎస్ఆర్ఎం ఏపీ యూనిర్సిటీ స్టూడెంట్ ఎఫైర్స్ డైరెక్టర్ రేవతి బాలకృష్ణన్, అమృత యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటర్ (ల్యాబరేటరీ) హర్షవర్ధన్, వీఐటీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జగదీష్, జీజీహెచ్ డ్రగ్ ఎడిక్షన్ సెంటరు ఇన్‌చార్జి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో ఎస్పీ సతీష్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులతో కలసి జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్లాక్ స్పాట్ లపై 15 రోజుల్లో నివేదిక అందించాలన్నారు. బ్లాక్ స్పాట్ ప్రాంతాలలో రహదారుల విస్తరణ, మరమ్మతు, సైన్ బోర్డు, వేగ నియంత్రణ తదితర చర్యలు సంబంధిత రహదారుల ఇంజనీరింగ్ అధికారులు తీసుకోవాలన్నారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే మార్చి 1వ తేది నుంచి రూ.1000 జరిమానా విధించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్ అండ్ బీఎస్ఈ శ్రీనివాస మూర్తి, టీటీసీ సీతారామిరెడ్డి, జాతీయ రహదారుల పీడీ పార్వతీశం, పంచాయితీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీఎంహెచ్‌వో విజయలక్ష్మీ, ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ కుమారి, ఆర్టీవోలు సత్యన్నారయణ ప్రసాద్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నిర్దిష్ట గడువులో పనులు పూర్తిచేయాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు


రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలకసంస్థ పరిధిలో జరిగే పనులను ప్రాధాన్య క్రమంలో నిర్దేశిత గడువులో పూర్తిచేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఏఈలకు సూచించారు. గురువారం కమిషనర్ రోజువారీ పర్యటనలో భాగంగా సంగడిగుంట, ఎల్ఎల్ఆర్, పాత గుంటూరు, గణేష్‌నగర్ ప్రాంతాలలో పర్యటించి అభివృద్ధి పారిశుధ్య పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీచేశారు. పర్యటనలో ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అద్దెలు చెల్లించని షాపులను సీజ్ చేయండి...

గుంటూరు నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లలో దీర్ఘకాలంగా అద్దె చెల్లించని షాప్‌లను సీజ్ చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు రెవెన్యూ అధికారులకు స్పష్టం చేశారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియం కాంప్లెక్స్‌లోని షాప్‌లను ఆయన పరిశీలిం అద్దె బకాయిలు చెల్లిచంని 5, 6 షాప్ లను సీజ్ చేయాలని రెవెన్యూ అధికారి మదన్ గోపాల్‌ని ఆదేశించారు. జీఎంసీ పరిధిలోని ప్రజారోగ్య, ఇంజినీరింగ్ కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యలపై ఫిర్యాదులు, అర్జీలు అందించేందుకు శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు.

నేటి సమస్యల పరిష్కారానికి గాంధీయే మార్గం

● ఆకాశవాణి పూర్వ సంచాలకులు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్

● గాంధీయే మార్గం పుస్తకావిష్కరణ



ప్రసంగిస్తున్న ఆకాశవాణి పూర్వ సంచాలకులు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని జనచైతన్య వేదిక హాల్లో అమరావతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, జన చైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో గురువారం 'గాంధీయే మార్గం' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సభకు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఆకాశవాణి పూర్వ సంచాలకులు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ హాజరయ్యారు. గాంధీయే మార్గం సిద్ధాంతాలు- ప్రభావాలు- పరిష్కారాలు అనే 4వ సంపుటిని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ఆవిష్కరించి, తొలి ప్రతిని విశ్రాంత తెలుగు ఆచార్యులు వావిలాల సుబ్బారావుకు అందజేశారు. ఆచార్య నాగార్జున విద్యాలయ విశ్రాంత రిజిస్ట్రర్ రావెల సాంబశివరావు పుస్తకాన్ని పరిచయం చేశారు. ఈ సందర్భంగా నాగసూరి వేణుగోపాల్ ప్రసంగిస్తూ మన దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు గాంధీయే మార్గమే పరిస్కారమని అన్నారు. డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ నేడు గాడ్సే వాదులు మత విద్వేషాన్ని రెచ్చగొడుతూ ముస్లింలపై వ్యతిరేకతను పెంచుతున్నారన్నారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ నేడు మతోన్మాద శక్తులు గాంధీజీ, నెహ్రూల పట్ల ద్వేష భావాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం నేస్తం సహ వ్యవస్థాపకులు టి. ధనుంజయ రెడ్డి, సెర్ప్ ఎన్.జి.వో అధ్యక్షులు హనుమ ప్రసాద్, మాదిగ జనసేవా సమితి నేతలు దాసరి జాన్ బాబు, పరంగి సత్యరాజు, కందుల ప్రసాద్, బీసీ సంక్షేమ సంఘ నేత తాడికొండ నరసింహారావు, ప్రముఖ సాహితీ పరిశోధకులు పారా అశోక్ తదితరులు ప్రసంగించారు.

ట్రాఫిక్ నియంత్రణ పరికరాల వితరణ


ట్రాఫిక్ పోలీసులకు అనౌన్స్‌మెంట్ మైక్‌ను అందజేస్తున్న తులసీ ధర్మచరణ్ తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని బృందావన్‌గార్డెన్స్, ఎన్టీఆర్ స్టేడియం కూడలి సిగ్నల్స్ పాయింట్ వద్ద ట్రాఫిక్ నిబంధనల గురించి 24/7 ఎనౌన్స్‌మెంట్ చేసేందుకు అవసరమైన మైక్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీ ధర్మచరణ్ గురువారం ట్రాఫిక్ ఎస్ఐ డి.శ్రీహరికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు తీసుకుంటున్న ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు అభినందనీయమన్నారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎటువంటి ప్రమాదాలు జరగవని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని కోరారు. కార్యక్రమంలో శంకర్‌నాయక్, రంగారావు, తేలప్రోలు వెంకటరావు, గాజుల సాయిరామ్ తదితరులున్నారు.

అఖండ మెజారిటీతో గెలవనున్న ఆలపాటి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

● ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణ- గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అఖండ మెజారిటీతో గెలవబోతున్నారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లోని ఒక ప్రైవేటు స్కూల్‌లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులతో సమావేశమై ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సింహాద్రి కనకాచారి, ముత్తినేని రాజేష్, లాల్ వజీర్, ఆర్‌వీ. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

● ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవి ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. అగ్రిగోల్డ్ వ్యవహారాన్ని అసెంబ్లీలో లేవనెత్తి బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ నేత మాల్యాద్రి నేతృత్వంలో నాయకులు ఎమ్మెల్యే వినతి పత్రాన్ని అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వం తమ రేషన్‌కార్డులు, పెన్షన్‌లు తొలగించిందని, వాటిని పరిశీలించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

పట్టభద్రులకు 'ఆలపాటి'తోనే మేలు

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల్లో పట్టభద్రులకు మేలు జరగాలంటే ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదుని భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ పాండురంగ విఠల్ అన్నారు. గురువారం ఇన్నర్ రింగురోడ్డు పరిసర ప్రాంతాల్లో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి పట్టభద్రులను కలిసి ఆలపాటికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్నర్‌రింగురోడ్డులోని ఆలపాటి నివాసంలో ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్ఆర్‌పీ ధరల ఉల్లంఘనపై ఫిర్యాదు

● దుకాణదారుడికి జరిమానా..

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగి మండవ రాజేష్ గురువారం బస్టాండ్‌లోని స్టాల్‌లో రెండు కూల్‌డ్రింక్స్ కొనుగోలు చేశాడు. రెండు డ్రింక్స్‌కు ఎమ్మార్పీ ధరకు అనుగుణంగా రూ.50 చెల్లిస్తే అదనంగా రూ.10 చెల్లించాలని దుకాణదారుడు దబాయించాడు. వెంటనే రాజేస్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఏటీఎం అందుబాటులో లేకపోవటంతో కంట్రోలర్ ఫిర్యాదు తీసుకొని సదరు దుకాణదారుడికి రూ.1180 జరిమానా విధించాడు.

మస్తానయ్య దర్గా పవిత్రతను కాపాడాలి

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని మస్తానయ్య దర్గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ నిర్వహణలోకి తీసుకోవాలని, దర్గా పవిత్రతను కాపాడాలని ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షుడు, వక్ఫ్ బోర్డు మాజీ జాయింట్ సెక్రటరీ షేక్ సుభాని, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మస్తాన్ దర్గా ధర్మకర్త రావి రామ్మోహన్ రావు, అతని కుమారుడు మస్తాన్‌సాయి, దర్గా పవిత్రతకు భంగం కలిగించటమే కాక వ్యాపారకేంద్రంగా మార్చారన్నారు. మస్తాన్‌సాయి డ్రగ్స్, మహిళలపై లైంగిక వేధింపుల వంటి కేసుల్లో నిందితుడిగా ఉన్నారన్నారు. త్వరలో బాబా పరిరక్షణ కమిటీగా ఏర్పడి అధికారులకు, నాయకులకు ఫిర్యాదులు చేస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3వరకు వికాస్‌నగర్ 4వ లైను నుంచి 11వ లైనువరకు, నవభారత్‌నగర్ 2వ లైను నుంచి 4/3వ లైను వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ గురవయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే చంద్రమౌళీనగర్ 5వ లైను నుంచి 7వ లైను వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30వరకు, ఇందిరాకాలనీ, ఐపీడీ కాలనీ ఫస్ట్ లైన్ నుంచి పదో లైను వరకు, ఎల్ఆర్ కాలనీ ఒకటో లైను నుంచి ఏడోలైను వరకు, గాంధీనగర్ ఒకటో లైను నుంచి ఏడో లైను వరకు ఉదయం 8 గంటల నుంచి 11వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీ10 ఏఈ మరో ప్రకటనలో పేర్కొన్నారు.

జగన్ సహా పలువురిపై కేసు

గుంటూరు ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కోడ్‌ను ఉల్లంఘించారంటూ పులివెందుల ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రెడ్డితోపాటు ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ళ అప్పిరెడ్డి, మాజీ మంత్రులు కొడాలి వెంకటేశ్వరరావు, అంబటి రాంబాబు, పేర్నెల్లి రామకృష్ణారెడ్డి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మోదుగుల వేణుగోపాలరెడ్డి, పేర్ని నానితోపాటు మరికొందరిపై నల్లపాడు పోలీసులు కేసున మోదు చేశారు. బుధవారం గుంటూరు మిర్చియార్డులో రైతులను పరామర్శించేందుకు వచ్చిన జగన్ సహా వైసీపీ నేతలు ఎన్నికల కోడ్ ఉల్లంఘించడమే కాక కలెక్టర్ ఆదేశాలను బేఖాతర్ చేశారని, 30 పోలీస్ యాక్ట్‌ను ఉల్లంఘించారని తెలిపారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి జీఎంసీ డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

సమయమిస్తే అప్పులు తీర్చేస్తాను

● పోలీస్ కస్టడీలో సాయిసాధన నిర్వాహకుడు పుల్లారావు

గుంటూరు ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కొంత సమయమిస్తే తన కష్టమర్ల అప్పులను తీర్చేస్తానని సాయి సాధన నిర్వాహకుడు పుల్లారావు తెలిపారు. చీటింగ్ కేసులో అరెస్టై గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్న పుల్లారావుని గురువారం పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. అలాగే విజయలక్ష్మి టౌన్‌షిప్ పేరుతో ఓ మహిళ నుంచి చేసిన రూ.11.60కోట్లకు అప్పులను కంపెనీ పేరుతో ఉన్న ఆస్తులు విక్రయిస్తే సరిపోతుందని విచారణలో పోలీసులకు తెలిపారు. దీనికి సంబంధించి లెక్కలు నరసరావుపేటలోని సాయిసాధన చిట్స్ కార్యాలయంలో ఉన్నాయని తెలిపారు. పుల్లారావును శుక్రవారం పోలీసులు నరసరావుపేటలోని సాయిసాధన చిట్స్ కార్యాలయానికి తీసుకెళ్లి ఆయా రికార్డులను సీజ్ చేయనున్నారు.

సాయి సాధన మోసాలపై సిట్..

నరసరావుపేటలోని సాయిసాధన చిట్‌ఫండ్స్, విజయలక్ష్మి టౌన్‌షిప్ ఆర్థికవివాదాలపై విచారణ జరిపేందుకు ప్రత్యేకపోలీసు బృందాన్ని(సిట్)ను ప్రభుత్వం నియమించింది. బాపట్ల ఎస్పీ తుషార్ డూడి నేతృత్వంలో రేపల్లె డీఎస్పీ, మాచర్ల రూరల్ సీఐ, మరికొందరిని ఈ బృందంలో సభ్యులుగా నియమించింది.

గ్రూపు-2 మెయిన్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

గుంటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్-2 సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా కొనసాగేలా లైజన్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదదేశాలు జారీ చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరలో ఆమె జేసీ ఏ భార్గవ తేజతో కలిసి ఏపీపీఎస్‌సీ గ్రూప్-2 సర్వీసెస్ మెయిన్స్ పరీక్షల నిర్వహణపై లైజన్ అఫీసర్లు, చీఫ్ సూపరింటెంట్‌లు, ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 11 పరీక్ష కేంద్రాలకు 11మంది సీనియర్ జిల్లా అధికారులను లైజను ఆఫీసర్లుగా నియమించామన్నారు. వారు పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించి, చీఫ్ సూపరింటెండ్‌లతో కలిసి ఇన్విజిలేటర్లుకు పరీక్షల నిర్వహణపై ఏపీపీఎస్‌సీ జారీచేసిన మార్గదర్శకాలను అవగాహన కల్పించటానికి ప్రత్యేక సమావేశం నిర్వహించాలన్నారు. పరీక్ష వేళలకు అనుగుణంగా కేంద్రాలకు బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులు, పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపుల ఏర్పాటుకు వైద్యారోగ్యశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో ఖాజావలి, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ వెంకటలక్ష్మి, లైజన్ అధికారులుగా నియమించిన జిల్లా అధికారులు, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లు పాల్గొన్నారు.

మైనారిటీలకు మళ్లీ మంచిరోజు

● ఇమామ్‌ల గౌరవ వేతనం విడుదలపై హర్షం


ఫ్లకార్డులతో సీఎంకు కృతజ్ఞతలు చెబుతున్న ఎమ్మెల్యే, ముస్లి నేతలు

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రతి ఎన్నికల హామీని అమలు చేసే దిశగా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని, అందులో భాగంగా ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనం విడుదల చేశారని తూర్పు ఎమ్మెల్యే మొహ్మద్ నసీర్ అన్నారు. ఇమామ్‌లు, మౌజన్ల గౌరవ వేతనం విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం ఆయన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞత తెలుపుతూ ప్రత్యేక దువ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలకు మళ్లీ మంచి రోజులు వచ్చాయన్నారు. రాష్ట్రంలో ఐదువేల మసీదుల్లో ఇమామ్‌లకు రూ.10వేలు, మౌజన్లకు రూ.5వేలు ఇస్తామన్న ఎన్నికల హామీని సీఎం అమలుచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో జమీర్, హఫీజ్, రఫీ, అన్వర్, బాషి, జాబి, ఉస్మాన్, అబ్దుల్లా, నూర్, ఖలీల్, అబ్బాస్, మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్‌ను గురువారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసిన సిమ్స్ విద్యా సంస్థల డైరెక్టర్ భీమనాథం భరత్‌రెడ్డి


మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలి: డీఈవో

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):చౌత్రాసెంటర్లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను డీఈవో సీవీ రేణుక గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. పరీక్షలకు శ్రద్ధగా సన్నద్ధం కావాలన్నారు. అత్యధిక మార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థినులకు ఎంఈవో ఎస్.ఎం.ఎం ఖుద్దూస్ సహకారంతో ఒక్కొక్కరికి రూ.500 చొప్పున విద్యార్థులకు అందించారు. పాఠశాల హెచ్ఎం ఎం.డి. ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతో మెరుగైన బోధన

ప్రైవేటు ప్లేస్కూళ్లకు ధీటుగా అంగన్వాడీ కేంద్రాలు నిర్వహించాలని, తద్వారా భవిష్యత్తులో ప్రభుత్వపాఠశాలల్లో చదివే విద్యార్థుల పునాది బలంగా ఉంటుందని డీఈఓ రేణుక అన్నారు. చౌత్రాసెంటర్లోని ప్రభుత్వ బాలికలలో ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలను డీఈఓ గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ అబ్దుల్ కుద్దూస్, రిసోర్స్‌పర్సన్స్ బి.జ్యోతి, శైలజ, అనురాధ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సిస్టర్ అనస్తాసియా 101వ జన్మదినోత్సవం


సిస్టర్ అనస్తాసియా

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పెదపరిమి గ్రామ వాసి సిస్టర్ మల్లవరపు అనస్తాసియా శుక్రవారం 101వ జన్మదినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా ఆమె జీవితం ఎంతోమందికి ఆదర్శనీయమని కుటుంబసభ్యులు, గ్రామస్థులు పేర్కొన్నారు. సిస్టర్ అనస్థాసియా అన్నలు పాప య్య, చిన్నయ్య, శౌరయ్య, అక్కలు పెదచిన్నమ్మ, చినచిన్నమ్మ చెల్లెలు శౌరమ్మ తదితరులు ఉన్నారు. సిస్టర్ అనస్తాసియా ప్రస్తుతం సెయింట్ స్టానిస్లాస్ కాన్వెంట్, బెంగుళూరులో ఉన్నారు. ఈ సందర్భంగా ఆమెకు పెదపరిమి ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జ్ఞానప్రకాష్, గ్రామ పెద్దలు, సిస్టర్ బంధువులు అభినందనలు తెలిపారు.

గుంటూరుతో ప్రత్యేక అనుబంధం...

గుంటూరులో ప్రముఖ విద్యాసంస్థగా పేరొందిన సెయింట్ జోసెఫ్ స్కూల్లో ఎక్కువ కాలం సేవలందించారు. నగరంలోని ఆర్థికంగా వెనుకబడిన అనేక పేదకుటుంబాలను చైతన్యపరచి విద్యపట్ల అవగాహన కల్పించి విద్యార్థులను ప్రోత్సహించారు. సిస్టర్ అనస్తాసియా జేఎంజే సభ్యురాలిగా 75 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా ఆ సంస్థ వారు ప్లాటినం జూబ్లీ వేడుకలు కూడా ఘనంగా నిర్వహించారు.

గుంటూరులో నేడు చికెన్, ఎగ్ ఫుడ్ మేళా

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు గుంటూరులోని పట్టాభిపురం స్వామి థియేటర్ గ్రౌండ్‌లో చికెన్, ఎగ్ ఫుడ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఓ నరసింహారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు జిల్లా ఫార్మర్స్, ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, జిల్లా కోళ్ల రైతుసమాఖ్య ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు కనీసవేతనం అమలుచేసి ఉద్యోగభద్రత కల్పించాలని ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయీస్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వెలుగురి రాధాకృష్ణ, శ్రీధర్ కోరారు. గురువారం గోరంట్లలో రైతు సాధికారసంస్థ కార్యాలయంలో సీఈవోకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రమేష్‌కుమార్, సునీల్‌కుమార్, విజయలక్ష్మి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వీరనాయకునిపాలెంలో క్వారీని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ సంజనాసిన్హా తదితరులు

అక్రమ తవ్వకాలపై విచారణ

● ఎన్జీటీ ఆదేశాలతో గ్రావెల్ క్వారీలను పరిశీలించిన అధికారుల బృందం

● సమగ్ర సర్వేకు సబ్‌కలెక్టర్ ఆదేశం

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలపై సమగ్ర సర్వే ప్రారంభించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ ఆదేశాలతో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనాసిన్హా అధికారుల బృందంతో అక్రమంగా మైనింగ్ జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. చేబ్రోలు మండలం, వీరనాయకునిపాలెంలో జరిగిన అక్రమ తవ్వకాలను పరిశీలించారు.పూర్తిగా సర్వేచేసి ఎంత లోతు గ్రావెల్‌తవ్వకాలు సాగించారో, ఎన్ని క్యూబిక్‌మీటర్‌ల మట్టి అక్రమంగా తరలించారో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అయితే క్వారీగుంతల్లో నీరు చేరడంతో లోతు ఎలా కొలుస్తారని సబ్ కలెక్టర్ ప్రశ్నించడంతో నీటి లోపల లోతును కూడా కొలిచే లేజర్ సాంకేతిక యంత్రాలు ఉన్నాయని అధికారులు వివరించారు. తక్షణమే ఆ యంత్రాలను తెప్పించి లోతు కొలవాలని ఆదేశించారు. అధికారుల పరిశీలన జరుగుతున్న సమయంలో ఆ ప్రాంతంలో మట్టి అక్రమ తవ్వకాలను వ్యతిరేకించిన గుమ్మ డి ప్రకాశరావు అనే రైతు సబ్‌కలెక్టర్ వద్దకు వచ్చి తమ గోడును వెళ్లబోసుకున్నారు.

అసైన్డ్ భూముల్లోనూ..

వీరనాయకునిపాలెం గ్రామంలో 1993లో 60 ఎకరాల డీకే పట్టాల భూములను ప్రభుత్వం దళిత రైతులకు పంటల సాగు చేసుకుని జీవనోపాధి పొందేందుకు అందించినట్లు గుమ్మడి ప్రకాశరావు తెలిపారు. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల పాటు ఈ అసైన్డ్ భూముల్లో వైసీపీ మద్దతు దారులు అక్రమంగా ప్రవేశించి ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు సాగించినట్లు ఆరోపించారు. పంటభూముల ధ్వంసంపై దళిత రైతులు ప్రశ్నిస్తే పోలీసులను అడ్డం పెట్టుకుని బెదిరించి, దౌర్జన్యం చేసి గ్రావెల్ కొల్లగొట్టినట్లు ఆరోపించారు. దళితులను గుర్తుపెట్టుకుని అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేసినట్లు ప్రకాశరావు సబ్‌కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ శుక్రవారం తమ కార్యాలయంలో కలిసి వివరాలు అందజేయాలని ప్రకాశరావుకు సూచించారు.

అడుగడుగునా పర్యావరణ ఉల్లంఘనలు

చేబ్రోలు మండలంలో మైనింగ్ పేరుతో అడుగడుగునా పర్యావరణ చట్టాలను ఉల్లంఘించారని జాతీయ హరిత ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించిన వాసిరెడ్డి శివలింగ ప్రసాద్ ఆరోపించారు. తన వద్ద ఉన్న ఆధారాలను సబ్‌కలెక్టర్‌కు ఆయన అందజేశారు. వైసీపీ పాలకులు కొంతమంది అధికారుల అండదండలతో వీరనాయకునిపాలెం శేకూరు, శలపాడు, వడ్లమూడి, సుద్దపల్లి గ్రామాలలో వందల ఎకరాలలో అక్రమ మైనింగ్ చేసినట్లు మైనింగ్ వివరాలను అందజేశారు. అక్రమ మైనింగ్‌తో 700 ఎకరాలలో ఉద్యాన పంటలు కనుమరుగు అయినట్లు ఆరోపించారు. తాత్కాలిక అనుమతులు పొంది అనుమతి గడువు ముగిసిన తరువాత కూడా యథేచ్ఛగా 70 మీటర్లకు పైగా మైనింగ్ సాగించినట్లు ఆధారాలను అందజేశారు. గతంలో విచారణ చేసిన అధికారులు సమగ్ర విచారణ చేపట్టకపోవడంతో న్యాయం జరగలేదనీ, ప్రస్తుత విచారణను సమగ్రంగా చేయాలని శివలింగ ప్రసాద్ అధికారులను కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ సంజనా సిన్హా రైతులతో మాట్లాడుతూ సమగ్ర సర్వే నిర్వహించి తవ్వకాల నివేదికను ఉన్నతాధికారుల ద్వారా నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలలో రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతపై అధికారులకు ఆదేశాలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత కట్టుదిట్టం

● జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరిగే ఉమ్మడి గుంటూరు - కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్సులను భద్రపరచడానికి స్థానిక ఏసీ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌లను గురువారం రెవెన్యూ అధికారులతో కలిసి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పరిశీలించారు. ఏసీ కళాశాలలో మొత్తం 4 స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటుచేయగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎటువంటి బందోబస్తు ఏర్పాటుచేయాలి, ఎంతమంది పోలీస్ సిబ్బందిని కేటాయించాలి, స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు వెళ్లడానికి ఎన్ని మార్గాలు ఉన్నాయి, బ్యాలెట్ బాక్సులను తీసుకొచ్చి - తీసుకెళ్లే సమయంలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఎటువంటి భద్రత చర్యలు తీసుకోవాలి అనే వివిధ అంశాలకు సంబంధించి చర్చించి జిల్లా పోలీస్ అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు జీవీ రమణమూర్తి, హనుమంతు, డీఎస్పీ ఏడుకొండల రెడ్డి, తూర్పు, పశ్చిమ తహసీల్దార్లు గణేష్, వెంకటేశ్వర్లు, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ మోసెస్, పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

తీరనున్న సాగునీటి వెతలు

● ప్రారంభానికి సిద్ధమైన పెదవడ్లపూడి ఎత్తిపోతల పథకం

● వైసీపీ హయాంలో నిలిపివేత

● పట్టుదలగా నిధులిచ్చి పూర్తి చేయించిన లోకేశ్

● వచ్చే నెలలో ప్రారంభోత్సవానికి సన్నాహాలు

● 25,344 ఎకరాలకు సాగునీటి లభ్యత

ఎన్నికలైపోయాయి... గెలిచేశాం కదా.. మళ్లీ ఎన్నికలొచ్చే వరకు చాలా టైముందని అనుకోకుండా... గెలిచిన మర్నాటి నుంచే నియోజకవర్గ ప్రజలకిచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చేపనిలో పడ్డారు మంగళగిరి ఎమ్మెల్యే నా రా లోకేశ్. గత ఎన్నికల్లో మంగళగిరి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలుపైనా ఆయన ప్రత్యేక దృష్టి పెట్టా రు. హామీ చిన్నదైనా.. పెద్దదైనా సరే.. గుర్తుంచుకొని మరీ వాటిని చకచకా అమలు చేసేస్తున్నారు. ఎన్నికల హామీల అమలు కావొచ్చు.. మంగళగిరి ప్రాంత అభివృద్ధిపై లోకేశ్‌కున్న పట్టుదల కావొచ్చు.. మంగళగిరికి మాత్రం ఇంతకుముందెన్నడూ కనీవిని ఎరుగనిరీతిలో అతిపెద్ద ప్రాజెక్టులు వరాల మాదిరి వచ్చిపడుతున్నా యి. ఈ క్రమంలో నియోజకవర్గ రైతాంగం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పెదవడ్లపూడి హైలెవల్ చానల్ ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి రెడీ అయిపోయింది. సుమారు రూ.15 కోట్ల వ్యయంతో ఈ ప్రా జెక్టును లోకేశ్ పూర్తి చేయించారు. ఈ పథకం వలన మంగళగిరి, తెనాలి, పొన్నూరు నియోజకవర్గాలలోని సుమారు 25,344 ఎకరాలకు సాగునీరందబోతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లోకేశ్ ఈ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయించి రైతన్నలకు కానుకగా అందిస్తున్నారు.

మంగళగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కృష్ణాడెల్టాలోని సుమారు 26 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే లక్ష్యంతో పెదవడ్లపూడి వద్ద బకింగ్‌హమ్ కాలువ నుంచి పశ్చిమంగా లాకులతో కూడిన ఓ హైలెవల్ ఛానల్‌ను 1937లో ఏర్పాటు చేశా రు. దీనికి అప్పట్లో నంబూరు హైలెవల్ ఛానల్‌గా నా మకరణం చేశారు. ఈ ఛానల్ ద్వారా మంగళగిరి, తె నాలి, పొన్నూరు నియోజకవర్గాలలోని 26 వేల ఎకరాలకు సాగునీటిని అందించే ప్రయత్నం చేశారు. అంటే బకింగ్‌హమ్ కాలువ నుంచి హైలెవల్ ఛానల్ లాకులను ఎత్తి ఛానల్‌లోకి నీటిని పంపేవిధంగా దీనిని డిజైన్ చేశారు. అ యితే ఈ ప్రణాళిక కేవల ఖరీఫ్ సీజను వరకు మాత్రమే రైతులకు వినియోగపడుతూ వచ్చింది. రబీలో బకింగ్‌హమ్ కాలువలో నీటి ప్రవాహం బాగా తక్కువగా ఉండడంతో హైలెవల్ ఛానల్ లాకులను పూర్తిగా ఎత్తివేసినప్పటికీ ఛానల్‌లోకి నీళ్లు ఎక్కని పరిస్థితులు నెలకొంటున్నాయి. బకింగ్‌హామ్ కాలువ పూర్తి సామర్థ్యం ఎనిమిది వేల క్యూసెక్కులు కాగా అందులో కనీసం సగం అంటే నాలుగువేల క్యూసెక్కుల ప్రవాహం వుంటేతప్ప హైలెవల్ ఛా నల్‌లోనికి నీళ్లు ఎక్కడంలేదు. దీనికికారణం బకింగ్‌హా మ్ కాలువ కన్నా హైలెవల్ ఛానల్ ఒకటిన్నర మీటరు ఎత్తులో ఉండడమే. దీంతో ఖరీఫ్ సీజనులో బకింగ్‌హా మ్ కాలువ పూర్తి నీటి సామర్థ్యంతో పరవళ్లు తొక్కు తూ ఉంటున్న కారణంగా హైలెవల్ ఛానల్‌లోకి నీళ్లు వెళ్లగలుగుతున్నాయి. రబీలో బకింగ్‌హమ్ కాలువలో నీటి ప్రవాహం చాలాతక్కువగా ఉండడంతో హైలెవల్ ఛానల్ కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరందక పైర్లు ఎండిపోతున్నాయి. దీనివల్ల రైతులు నష్టపోతున్నారు. ఈ పరిస్థితులపై మూడు నియోజకవర్గాల్లోని రైతులు ఎప్పటినుంచో ఆందోళన చెందుతున్నారు.

యుద్ధప్రాతిపదికన పూర్తి..

హైలెవల్ ఛానల్ ఆయకట్టుకు రబీలో కూడ సాగునీరందించాలంటే బకింగ్‌హమ్ కాలువ నుంచి హైలెవల్ ఛానల్‌లోకి నీళ్లను ఎత్తిపోయడమే ఏకైక పరిష్కార మార్గమని నిపుణులు ప్రభుత్వానికి సూచిస్తూ వచ్చారు. దశాబ్దాల తరబడి ఈ సమస్య అపరిష్కృతంగా ఉన్నప్పటికీ రాష్ట్ర విభజనానంతరం రాజధాని ఈ ప్రాంతానికే రావడంతో టీడీపీ ప్రభుత్వం 2018లో ఈ సమస్యపై దృష్టిని సారించింది. సుమారు రూ.14.88 కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పనులను చేపట్టింది. 2019 ఎన్నికల నాటికి సుమారు రూ.9కోట్ల విలువైన దాదాపు 70శాతం పనులను పూర్తి చేసింది. అయితే 2019 ఎన్నికల్లో అధికారం చేపట్టిన వైసీపీ పథకం పనులు పూర్తిగా నిలిపేసింది. దీంతో మూడు నియోజకవర్గాలకు చెందిన ఆయకట్టు రైతులకు ఆశాభంగమే ఎదురైంది. 2024 ఎన్నికల సందర్భంగా దుగ్గిరాల మండల ప్రజలు ఈ సమస్యను లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి ప్రాధాన్యంగా ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆ ప్రకారమే లోకేశ్ గెలిచిన వెంటనే ఎత్తిపోతల పథకానికి సంబంధించి గతంలో కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బిల్లులను చెల్లించి మిగతా నిధులను కూడ మంజూరు చేయించి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించారు. ఎత్తిపోతల నిర్వహణ కోసం పక్కనే ప్రత్యేకంగా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను కూడ ఏర్పాటు చేయించారు.

ట్రయల్‌రన్‌పై అధికారుల సంతృప్తి


ఇటీవలే ఎత్తిపోతల పథకం పనులు పూర్తయ్యాయి. తాజాగా ఏపీఎస్ఐడీసీ అధికారులు ట్రయల్‌రన్ కూడ నిర్వహించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఎత్తిపోతలలో 215 అశ్విక సామర్థ్యం కలిగిన నాలుగు మోటార్లను ఏర్పాటు చేశారు. వీటి సాయంతో బకింగ్‌హమ్ కాలు వ నుంచి నీటిని తోడి జాక్‌వెల్‌లోకి పోస్తారు. దీని నుంచి నీరు హైలెవల్ ఛానల్‌లోకి ప్రత్యేకంగా ఏర్పా టు చేసిన డెలివరీ పైపుల ద్వారా సరఫరా అవుతాయి. వాస్తవానికి ఖరీఫ్ సీజనులో లాకుల ద్వారా బకింగ్‌హమ్ కాలువ నుంచి నీటిని హైలెవల్ ఛానల్‌లోకి సహజ ప్రవాహం ద్వారా తీసుకుని రబీ సీజనులో మా త్రం ఎత్తిపోతల సాయంతో నీటిని హైలెవల్ ఛానల్‌లోనికి ఎత్తిపోసుకోవచ్చు. తద్వారా 25,344 ఎకరాలకు రబీ సీజనులోకూడ పుష్కలంగా సాగునీరందుతోంది. హైలెవల్ ఛానల్ ఆయకట్టు కింద ఖరీఫ్‌లో వరిని పం డిస్తుండగా, రబీలో మొక్కజొన్న, మినుములను పండిస్తున్నారు. ఎత్తిపోతల పథకం పనులు పూర్తియినందున మార్చి నెలలో ప్రారంభించేందుకు సన్నాహాలను చేస్తున్నామని ఏపీఎస్ఐడీసీ అధికారులు తెలిపారు. దీంతో రైతులు ఆనందోత్సాహాలను వ్యక్తం చేస్తున్నారు.



ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏర్పాటుచేసిన 215 హెచ్‌పీ సామర్థ్యం గల నాలుగు మోటార్లు



ఎత్తిపోతల కోసం ప్రత్యేకంగా నిర్మించిన 33/11కేవీ సబ్‌స్టేషన్



కష్టాలు తొలగినట్లే..

ఎన్నో ఏళ్ల నీరందక పంటలు ఎండిపోయి బాగా నష్టపోయాం. కౌలుకి తీసుకున్న వాళ్లు కూడా ఇన్నాళ్లు నష్టపోతూ వచ్చారు. ఇక ఈ నష్టాల కష్టాలకు ఎత్తిపోతలతో తెరపడింది.

- కొరిటాల రామయ్య, కంఠంరాజు కొండూరు రైతు



ఎత్తిపోతల పథకం గొప్పవరం

ఎన్నోఏళ్లుగా హైలెవెల్ ఛానల్ ద్వారా తగినంత నీరందక తరచూ ఎండుతున్న పంటలకు, ఎత్తిపోతల పథకం గొప్పవరమని పెనుమూలి నీటిసంఘ అధ్యక్షుడు కొరిటాల భాస్కర్ అన్నారు. వేలాది ఎకరాల పంటలకు పూర్తిస్థాయిలో నీరందించేందుకు, టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే రైతుల ఆశలు నెరవేర్చడం హర్షణీయమన్నారు.

- కొరిటాల భాస్కర్

పోలింగ్ సిబ్బందికి సామగ్రిని సక్రమంగా అందించండి

● ఆర్వో నాగలక్ష్మి ఆదేశాలు



ఏసీ కళాశాలలో రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన జేసీ, డీఆర్వో

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి ఈ నెల 27వ తేదీన జరిగే ఎన్నికలకు సంబంధించి 26వ తేదీన పోలింగ్ సిబ్బందికి సామగ్రిని సక్రమంగా అందించాలని రిటర్నింగ్ అధికారి ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక ఏసీ కళాశాలలో బ్యాలెట్ బాక్సులు భద్రపరిచే గదులు, రిసెప్షన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను గురువారం సాయంత్రం ఆమె సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజతో కలిసి పరిశీలించి సూచనలు జారీ చేశారు. ప్రధానంగా డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ల వద్ద సైనేజ్ బోర్డులను ఎన్నికల సిబ్బంది గుర్తించే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ మెటీరియల్ తీసుకున్న అనంతరం సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు సురక్షితంగా చేర్చేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కౌంటర్ల వద్ద ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి అల్పాహారం, తాగునీరు, శుచి శుభ్రమైన భోజనాలు అందించాలని సూచించారు. ఓటింగ్ అనంతరం పోలింగ్ బూత్‌ల నుంచి తీసుకువచ్చిన బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం సురక్షితంగా భద్రపరిచేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కౌంటర్ల వద్ద మంచి గాలి, వెలుతురు ఉండేటట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా బ్యాలెట్ కౌంటింగ్‌కు సంబంధించి ఏసీ కాలేజీలోని ప్రేయర్ హాల్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ టేబుళ్లను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అధికారులకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించి ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తి అయ్యేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, ల్యాండ్ అండ్ సర్వే శాఖ ఏడీ పవన్ కుమార్, గుంటూరు తూర్పు, పశ్చిమ మండల తహసీల్దార్లు నగేష్, వెంకటేశ్వర్లు, రెవెన్యూ, సర్వే అధికారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు



క్యూలైన్‌ల ఏర్పాట్లుపై కూలీలకు సూచనలిస్తున్న ఈవో అశోక్‌కుమార్

అమృతలూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రాల్లో ఒకటైన గోవాడ శ్రీబాలకోటేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా ఆలయం వద్ద చలువ పందిళ్లు వేశారు. ఆలయంతో పాటు, ఉప ఆలయాలను రంగులతో తుది మెరుగులు దిద్దుతున్నారు. మహాశివరాత్రి పర్వదినం రోజుల లక్షలసంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ఇక్కడ ఐదు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయి. స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు కోసం ఐరన్ బారికేట్లును వినియోగించారు. దాదాపు క్యూలైన్‌ల ఏర్పాటు పూర్తైంది. ఆలయ పరిసర ప్రాంతాలను చదును పరిచారు. ఉత్సవాలకు చేయాల్సిన ఏర్పాట్లు ఎప్పటికప్పుడు అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పరిశీలిస్తున్నారు. ఉత్సవాల ఏర్పాట్లుపై ఇప్పటికే రెండుసార్లు అధికారులు సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరికి స్వా మి దర్శనం జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ఈవో అశోక్‌కుమార్ తెలిపారు.

ఆట స్థలాలకు మహర్దశ

● పీఎంశ్రీ పథకంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బాగుపడిన క్రీడా ప్రాంగణాలు

● రాష్ట్రంలో 484 పాఠశాలలకు రూ.24.20 కోట్లు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆట స్థలాల అభివృద్ధికి పీఎంశ్రీ పథకం దోహదపడుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి స్కూల్స్ రైజింగ్ ఇండియాలో ఉన్నత పాఠశాలల ఆట స్థలాలు బాగుపడుతున్నాయి. రాష్ట్రంలోని 484 పాఠశాలలకు రూ.24.20 కోట్లు కేటాయించారు. తొలివిడత రూ.10.54 కోట్లు విడుదల చేశారు. ఈ నిధులతో ఆయా పాఠశాలల్లో గ్రౌండ్‌లకు మెరకలు వేయడం, ఆడుకోవడానికి వీలుగా తీర్చిదిద్దే పనులు చేపట్టారు. మూడు క్రీడలకు కోర్టులను పక్కాగా అభివృద్ధి చేసేందుకు ఇప్పటి వరకు వచ్చిన నిధులను కొంతమేర వినియోగించారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడలకు అవసరమైన మూడు కోర్టులను పక్కాగా రూపొందించేందుకు ఈ నిధులను వినియోగిస్తున్నారు. ఈ పథకం కింద ఒక్కో పాఠశాలకు రూ.5 లక్షలు కేటాయించగా, రూ.2 లక్షలు బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. దీంతో కొంత అభివృద్ధి పనులను నిర్వహించారు. ఆటస్థలం అంతా అభివృద్ధి చేసి విద్యార్థులు ఆడుకునేలా మూడు కోర్టులను చక్కగా తీర్చిదిద్దనున్నారు. క్రీడా ప్రాంగణంలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా తగిన మెరకవేసి కోర్టులను ఏర్పాటు చేసుకోవాలని సమగ్ర శిక్షా అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. గుంటూరు జిల్లాలో అంగలకుదురు, కొల్లిపర, రేవేంద్రపాడు, తుళ్లూరు, నిడుబ్రోలు, పెదనందిపాడు, ముట్లూరు, నంబూరు, ఓబులునాయుడుపాలెం, రావెల, గణపవరం పాఠశాలలు, బాపట్ల జిల్లాలో అమృతలూరు, ఐలవరం, గుళ్లపల్లి, నిజాంపట్నం, మంతెనవానిపాలెం, పందిళ్లపాలెం, ఈపూరుపాలెం, పెదగంజాం, ఉప్పిపాలెం, కొప్పెరపాడు, యద్దనపూడి, ఏల్చూరు, మేదరమెట్ల, నాగులపాడు పాఠశాలలకు నిధులు మంజూరు చేశారు. రెండో విడత రూ.9.94 కోట్లు కూడా విడుదలైతే ఈ పాఠశాలల క్రీడా ప్రాంగణాలు ఏ కాలమైనా విద్యార్థులు ఆనందంగా ఆడుకోవడానికి అనువుగా రూపుదిద్దుకోనున్నాయి.



ఏడాదిలో హైవే నిర్మాణ పనులు పూర్తి

● ఎన్‌హెచ్‌ఏఐ రీజనల్ ఆఫీసర్ ఆర్‌కే సింగ్



బేబీ ఫీడింగ్ సెంటరును ప్రారంభిస్తున్న ఆర్‌కే సింగ్ తదితరులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుమారు 1300 కిలోమీటర్ల మేర హైవే నిర్మాణ పనులు జరుగుతున్నాయని, వాటిని సంవత్సరంలోగా పూర్తి చేస్తామని నేషనల్ హైవే అథారిటీ విజయవాడ ప్రాంతీయ అధికారి ఆర్‌కే సింగ్ తెలిపారు. నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో మంగళగిరి మండలం కాజ టోల్ ప్లాజా వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన రెండు అంబులెన్సులు, బేబీ ఫీడింగ్ సెంటరు, చిన్నపిల్లల పార్కు, టాయిలెట్లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగ్ మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన అంబులెన్సులో ప్రథమ చికిత్సతోపాటు అత్యవసర సమయంలో చికిత్స అందించే వెసులుబాటు ఉందన్నారు. రాష్ట్రంలో నూతన రోడ్ల నిర్మాణం చేపట్టబోతున్నట్లు తెలిపారు. జాతీయ రహదారి పనుల్లో కొన్నిచోట్ల అండర్‌పాస్‌లను ప్రభుత్వం సూచించిందని, రాజధాని ప్రాంతంలో ప్రస్తుతం జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణంలో ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారని చెప్పారు. విజయవాడ పడమర బైపాస్ ఏప్రిల్ చివరినాటికి కొంతమేర పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. అమరావతి రాజధానిలో ఓఆర్ఆర్ పనులకు సంబంధించి ఏడు నెలల్లో టెండర్లు పూర్తిచేసి, మరో ఏడాదిలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ పార్వతీశం, ఎంకే నాయక్, కృష్ణ చైతన్య, ప్రసాద్, శ్రీ వేంకటేశ్వర ఫుడ్ బీవరేజస్ సంస్థ ప్రతినిధి శ్రీనివాసరావు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు పాల్గొన్నారు.

ఉప్పలపాడు పక్షుల కేంద్రం కన్జర్వేషన్ రిజర్వుగా నోటిఫై

● కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

గుంటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామంలో ఉన్న పక్షుల రక్షిత కేంద్రాన్ని వన్యప్రాణి చట్టం -1972 నిబంధనలను అనుసరించి కన్జర్వేషన్ రిజర్వ్‌గా నోటిఫికేషన్ ఇవ్వాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. అలానే గుంటూరు జిల్లాలోని వెట్ ల్యాండ్‌లను చట్ట ప్రకారం నోటిఫై చేయాలన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి వెట్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్‌తేజతో కలసి పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా అటవీశాఖ అధికారి హిమశైలజ మాట్లాడుతూ ఉప్పలపాడు పక్షుల కేంద్రం గత 20 సంవత్సరాలుగా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న దన్నారు. దీనికి వన్యప్రాణి చట్టం ప్రకారం-1972 ద్వారా కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అరుదైన పక్షి జాతులను కాపాడుకోవాలని, వెట్‌ల్యాండ్ ఉపయోగాలను వివరించారు. దీనికి సంబంధించి సంబంధిత శాఖల అధికారులు సహకారాన్ని అందించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు అటవీ శాఖ ద్వారా గుర్తించిన 300 వెట్‌ల్యాండ్స్‌ను పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, కాలుష్య నియంత్రణ మండలి, రెవెన్యూ స్టేక్ హోల్డర్ శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకర్ల సహకారం కీలకం

● ఎంఎస్‌ఎంఈడీసీ చైర్మన్ శివశంకర్

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకర్ల సహకారం అత్యంత కీలకమని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఎంఎస్‌ఎంఈడీసీ) చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ అన్నారు. రాష్ట్రంలో కొత్తగా యూనిట్లు నెలకొల్పే యువ పారిశ్రామికవేత్తలకు రుణాలు అందించి సహకరించాలని ఆయన బ్యాంకర్లను కోరారు. గురువారం విజయవాడ ముత్యాలంపాడులోని ఎంఎస్‌ఎంఈడీసీ కార్యాలయంలో బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో శివశంకర్ మాట్లాడారు. చదువుకున్న యువతీ యువకులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని పారిశ్రామికవేత్తలుగా రాణించాలని పిలుపునిచ్చారు.

సంచార వాహనాల ద్వారా మెరుగైన పశువైద్య సేవలు

● వెటర్నరీ డైరెక్టర్ దామోదర్‌నాయుడు

అమరావతి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచార వాహనాల ద్వారా మెరుగైన పశువైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు తెలిపారు. ప్రస్తుత ఏజెన్సీ కాల పరిమితి ముగియడంతో అర్హత గల ఏజెన్సీల నుంచి ఈప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించామని చెప్పారు. నిబంధనల ప్రకారం కొద్ది రోజుల్లో ఏజెన్సీని ఎంపిక చేస్తామన్నారు. అప్పటి దాకా పశువైద్య సేవలకు అంతరాయం లేకుండా 165 వాహనాల ద్వారా ప్రస్తుత ఏజెన్సీ సేవలు అందిస్తుందని చెప్పారు. అలాగే 1962 టోల్ ఫ్రీ నంబరు అందుబాటులో ఉందని వివరించారు.

మిర్చియార్డులో అమ్మకాలు వేగవంతంగా జరగాలి

● మార్కెటింగ్ శాఖ జేడీ శ్రీనివాసరావు

గుంటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో రైతులు తీసుకొచ్చిన మిర్చి ప్రస్తుతం ఏ విధంగా అయితే వేగవంతంగా అమ్మకాలు జరుగుతున్నాయో ఇదే జోరు కొనసాగాలని మార్కెటింగ్ శాఖ విజయవాడ రీజియన్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం ఆయన చుట్టుగుంటలోని మార్కెటింగ్ ఏడీ కార్యాలయంలో ఏఎంసీల సెక్రెటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మిర్చియార్డుకు మార్చి మొదటి వారం నుంచి మిర్చి టిక్కీల రాక మరింతగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఆ సందర్భంలోనూ ట్రేడింగ్ వేగంగా జరిగి, ఏ రోజుకు ఆ రోజు సరుకు బయటకుపోయేలా పర్యవేక్షించాలని యార్డు అధికారులను ఆదేశించారు. అలానే మార్కెట్ కమిటీలు లక్ష్యం మేరకు ఫీజులు వసూలు చేయాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏడీ బీ రాజబాబు, మార్కెట్ కమిటీల సెక్రెటరీలు పాల్గొన్నారు.

చర్లపల్లి - దానాపూర్ - చర్లపల్లి ప్రత్యేక రైళ్ల రద్దు

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆపరేషనల్ సమస్యల కారణంగా చర్లపల్లి - దానాపూర్ - చర్లపల్లి ప్రత్యేక రైళ్లను రద్దు చేసినట్లు గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21నుంచి 28వ తేదీ వరకు నంబరు 07791 చర్లపల్లి-దానాపూర్, నంబరు 07792 దానాపూర్-చర్లపల్లి రైళ్లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

పశ్చిమ డెల్టాకాల్వకు 1716 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 1716 క్యూసెక్కుల సాగునీటిని గురువారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.9 అడుగుల నీటి మట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 202 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 176, పశ్చిమకాల్వకు 70, నిజాంపట్నంకాల్వకు 80, కొమ్మమూరు కాల్వకు 746 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

168 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డులో గురువారం జరిగిన వేలంలో 168 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.8,400 గరిష్ఠధర రూ.10,750 మోడల్ ధర రూ.10,750 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.8,400, గరిష్ఠ ధర రూ.10,001 మోడల్‌ధర రూ.10,001 పలికాయి.

యూటీఎఫ్ పట్టణ అధ్యక్షుడిగా దాసరి అంకారావు

మంగళగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మంగళగిరి పట్టణశాఖ సమావేశం గురువారం రాత్రి కే నిర్మల అధ్యక్షతన జరిగింది. యూటీఎఫ్ పట్టణ అధ్యక్షుడిగా దాసరి చిన్న అంకారావును ఎన్నుకున్నట్టు ప్రకటించారు. ఈ నెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, శ్రీనివాసరావు, ఆంజనేయులు, శ్రీనివాసరావు, మోహన్ శ్రీనివాస్, కోటిరెడ్డి, ఎస్కే రెహమాన్, ఏడుకొండలు పాల్గొన్నారు.

జనసైనికుడికి చిల్లపల్లి సంతాపం

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 8వ తేదీన సీతానగరంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన జనసైనికుడు చెన్నంశెట్టి వెంకటసత్యనారాయణకు ఏపీఎంసీఎస్ఐ డీసీ చైర్మన్, నియోజకవర్గ జన సేన ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు గురువారం మధ్యాహ్నం తాడేపల్లిలోని మృతుడి నివాస గృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిల్లపల్లి మాట్లాడుతూ జనసేన తరపున రూ.5 లక్షల ఇన్సూరెన్స్‌తోపాటు కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ఐటీ విభాగం కోఆర్డినేటర్ చవ్వాకుల కోటేష్‌బాబు, గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కోమలి, జనసేన తాడేపల్లి పట్టణ, మండల అధ్యక్షుడు అంబటి తిరుపతిరావు, సామల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు-2 మెయిన్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్-2 సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా కొనసాగేలా లైజన్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఆమె జేసీ ఏ భార్గవ తేజతో కలిసి ఏపీపీఎస్సీ గ్రూప్-2 సర్వీసెస్ మెయిన్స్ పరీక్షల నిర్వహణపై లైజన్ అఫీసర్లు, చీఫ్ సూపరింటెంట్‌లు, ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 11 పరీక్ష కేంద్రాలకు 11మంది సీనియర్ జిల్లా అధికారులను లైజను ఆఫీసర్లుగా నియమించారన్నారు. లైజన్ అధికారులు ముందస్తుగానే వారికి కేటాయించిన కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించుకొని, చీఫ్ సూపరింటెండెంట్‌లతో కలిసి ఇన్విజిలేటర్లకు పరీక్షల నిర్వహణపై ఏపీపీఎస్సీ జారీచేసిన మార్గదర్శకాలపై అవగాహన కల్పించటానికి ప్రత్యేక సమావేశం నిర్వహించాలన్నారు. లైజన్ ఆఫీసర్లు పరీక్ష నిర్వహణకు సంబంధించి నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ పరీక్ష ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు పర్యవేక్షించాలన్నారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె చెప్పారు.

యువకుడు ఆత్మహత్య

గుంటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అశ్విని లాడ్జిలో తెనాలికి చెందిన వి.రవితేజ (32) అని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడు రోజుల క్రితం గది అద్దెకు తీసుకున్నాడు. రెండు రోజులుగా గది నుంచి బయటకు రాకపోవడంతో గురువారం లాడ్జి సిబ్బంది పరిశీలించగా, రూం నుంచి వాసన వస్తుండడంతో గదిలోపలికి వెళ్లి పరిశీలించగా పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరోనా సమయంలో ఆయన అక్క మృతి చెందినట్లు తెలిసింది. అంతేకాకుండా కొంతమేరకు అప్పులు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాడేపల్లిలో అక్రమ తవ్వకాలు !

● పూర్తి అనుమతులు లేకుండా మెయిల్ అక్రమ తవ్వకాలు
● జిల్లా మైనింగ్ అధికారికి రూరల్ తహసీల్దార్ ఫిర్యాదు
● కొత్తపేట పోలీసుస్టేషన్‌లో కూడా ఫిర్యాదు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పర్యావరణ అనుమతులు, పూర్తి స్థాయి అనుమతులు లేకుండా విజయవాడ వెస్ట్ బైపాస్ పనులు చేపడుతున్న మెయిల్ సంస్థ తాడేపల్లిలో అక్రమ తవ్వకాలు జరిపిందని ఆ సంస్థతో పాటుగా పలువురు ప్రైవేటు వ్యక్తులు కూడా ఈ అక్రమ తవ్వకాలలో ఉన్నారంటూ విజయవాడ రూరల్ తహసీల్దార్ బీ సుగుణ జిల్లా మైనింగ్ అధికారికి అధికారికంగా లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. నిబంధనలను ఉల్లంఘించిన మెయిల్ సంస్థ, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే మెయిల్, ప్రైవేటు వ్యక్తుల అక్రమ తవ్వకాలపై తహసీల్దార్ సుగుణ కొత్తపేట పోలీసుస్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులతో మెయిల్ అక్రమ తవ్వకాల బాగోతాలు బహిర్గతమయ్యాయి. మెయిల్‌ను అడ్డం పెట్టుకుని కొంతమంది ప్రైవేటు వ్యక్తులు కూడా అక్రమ క్వారీయింగ్‌కు పాల్పడిన అంశాలు వెలుగులోకి వచ్చాయి. వివరాల్లోకి వెళితే.. విజయవాడ రూరల్ మండలం తాడేపల్లి గ్రామంలోని రీ సర్వే నెంబర్ 247/3ఏ1, 2బీ1 లలో 2.51 ఎకరాల భూమిని మైనింగ్ చేయటానికి విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు కాంట్రాక్టు మెయిల్ .. జిల్లా మైనింగ్ అధికారికి అర్జీలు దాఖలు చేసుకోవటం జరిగింది. ఈ అర్జీపై రెవెన్యూ శాఖను నివేదిక కోరారు. మెయిల్ ప్రతిపాదించిన భూమి అటవీ భూమికి 500 మీటర్ల లోపు ఉండటం వల్ల జిల్లా అటవీశాఖ పరిశీ లించి నివేదిక ఇవ్వాల్సిందిగా రెవెన్యూ తహసీల్దార్ కోరారు. అటవీశాఖ అధికారులు కొన్ని షరతులకు లోబడి అనుమతికి సిఫార్సు చేయటంతో అనుమతులు ఇవ్వటానికి జిల్లా మైనింగ్ అధికారికి రెవెన్యూ అధికారులు నివేదించారు. విజయవాడ రూరల్ తహసీల్దార్ సుగుణ జిల్లా మైనింగ్ అధికారికి తాజాగా ఒక లేఖ రాశారు. ఈ లేఖ ప్రకారం.. రెవెన్యూ సిబ్బంది క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసిన సందర్భంలో మెయిల్ సంస్థకు అనుమతించిన సర్వే నెంబర్ 247/3ఏ1, 2బీ1లలో 2.51 ఎకరాల భూమితో పాటుగా సర్వే నెంబర్ 247/3బీలో 2.60 ఎకరాలు, సర్వే నెంబర్ 247/3ఏ2లో 0.47 సెంట్లు, సర్వే నెంబర్ 247/3ఏ3లో 0.25 సెంట్లలోని భూమిలో అక్రమ తవ్వకాలు జరిగాయని తెలిపారు. అలాగే మెయిల్ సంస్థకు మౌఖికంగా అనుమతించినా సర్వే నెంబర్ 247/3ఏ1లో 1.51 సెంట్ల భూమికి పూర్తిస్థాయిలో ఇప్పటివరకు అనుమతులు రాకుండానే తవ్వకాలు జరిగాయని అన్నారు. అలాగే కొత్తపేట పోలీసులకు చేసిన ఫిర్యాదులో మెయిల్ సంస్థతో పాటు, ప్రైవేటు వ్యక్తులు వాసా నాగరాజు, పోతురాజు మాధవరావులు కూడా అక్రమ మైనింగ్ జరిపారని వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

కోతుల స్వైరవిహారం

● భయపడుతున్న చిన్నారులు, విద్యార్థులు
● పట్టించుకోని సంబంధిత అధికారులు

తాడికొండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గ్రామాల్లో కోతులు స్వైరవిహారం చేస్తున్నాయి. తాడికొండలో కోతుల బెడద ఎక్కువగా ఉన్నది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా కోతులు ఇళ్ల మధ్యలో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. గుంపులు గుంపులుగా వచ్చి ఇళ్లలోకి దూరి వస్తువులను, తినుబండారాలను ఎత్తుకెళ్తున్నాయి. ఉదయం, సాయంత్రం స్కూల్స్‌కు వెళ్లివచ్చే విద్యార్థులు, చిన్నారులు భయపడుతున్నారు. సాయంత్రం వేళల్లో ఆడుకోవటానికి బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. చిన్నారుల చేతుల్లో ఉన్న తినుబండారాలను తీసుకువెళ్తున్నాయి. గుంపులు, గుంపులుగా ఇళ్ల మధ్యలోకి వచ్చి పెద్ద పెద్దగా కేకలు వేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గతంలో కోతులను తరిమివేయటానికి ప్రత్యామ్నాయ చర్యలను పంచాయతీ అధికారులు చేపట్టారు. ప్రస్తుతం గ్రామాల్లో కోతులు బెడద ఎక్కువగా ఉన్న పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా మిన్నకుండి పోతున్నారు.



ఇళ్ల మధ్య తిరుగుతున్న కోతులు

కోతులు బెడద నుంచి ప్రజలను రక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కేఎస్ లక్ష్మణరావుకు ఏపీటీఎఫ్ మద్దతు

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు సంపూర్ణ మద్దతు ఇవ్వనున్నట్లు ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్ చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీల నేతలు ఈ ఎన్నికల్లో ప్రవేశిస్తే శాసనమండలిలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షకుల పక్షాన ప్రాతినిధ్య వహించే వారి సంఖ్య తగ్గిపోతుందన్నారు. లక్ష్మణరావుకు ఎమ్మెల్సీగా సుదీర్ఘ అనుభవం ఉందని, మండలి వేదికగా సమస్యలపై ప్రశ్నించే అవకాశం ఆయనకు మరోసారి దక్కాలన్నారు.

ఇళ్లు, ఖాళీ స్థలాల పన్నులపై వడ్డీ మినహాయించాలి : సీపీఐ

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో ఇళ్లు, ఖాళీ స్థలాలకు విధించిన పన్నులపై వడ్డీని మినహాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు గురువారం లేఖ రాశారు. ఇప్పటికే పన్నులు కట్టలేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వడ్డీ మరింత భారంగా మారిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 31వ తేదీ లోపు కట్టాల్సిన పన్నులపై వడ్డీ మినహాయింపునిస్తూ జీవో విడుదల చేయాలని రామకృష్ణ కోరారు.

ఎస్జీటీలను 'టెన్త్' డ్యూటీల నుంచి మినహాయించాలి

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ఇన్విజిలేషన్, స్పాట్ డ్యూటీల నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్లను మినహాయించాలని ఏపీ ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కాకి ప్రకాష్‌రావు పాఠశాల విద్యాశాఖ అధికారులను కోరారు. రాష్ట్రంలోని ఎక్కువ ప్రాథమిక పాఠశాలల్లో ఒకరిద్దరు మాత్రమే టీచర్లు పనిచేస్తున్నారని, వారికి పరీక్షల డ్యూటీలు వేస్తే బోధనకు ఆటంకం కలుగుతుందన్నారు.

శిశు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● ఏపీడీపీవో విజయనిర్మల

కాకుమాను, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): శిశు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ఏపీడీపీవో విజయనిర్మల అన్నారు. కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం గురువారం మూడో రోజు జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏసీడీపీవో మాట్లాడతూ ప్రతి చిన్నారి సంరక్షణ బాధ్యత అంగన్‌వాడీ కేంద్రానిదేనన్నారు. బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వం పౌష్టికాహారం అందజేస్తుందన్నారు. డీఆర్‌పీఎస్ సాయికృష్ణ మాట్లాడుతూ ప్రాథమిక విద్య ప్రతి ఒక్కరికి అవసరమని చెప్పారు. బడిబయట చిన్నారులను గుర్తించి వారిని పాఠశాలలో చేర్చే విధంగా అంగన్‌వాడీలు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు కెన్నడీ, కేవీ బాస్కరరావు, అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో విజేత జేఎంజే కళాశాల

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ అంతర కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీల్లో జేఎంజే కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఏఎస్ఎన్ కళాశాల ద్వితీయ స్థానం, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల తృతీయ స్థానంలో నిలిచాయి. పట్టణంలోని జేఎంజే కళాశాలలో నిర్వహిస్తున్న పోటీలు గురువారం ముగిశాయి. విజేతలకు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్ణచంద్ ట్రోఫీలు, పతకాలు అందజేశారు.

ఓటు హక్కును వినియోగించు.. దేశ భవిష్యత్తును నిర్ణయించు

● ఈఆర్‌వో, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి

దుగ్గిరాల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని దేశభవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని మంగళగిరి నియోజకవర్గ ఈఆర్‌వో, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి అన్నారు. దుగ్గిరాలలోని డాక్టర్ కొత్తరఘురామయ్య అన్నారు. ఈ నెల 27వ తేదీన కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న విషయం విదితమే. దుగ్గిరాలలోని డాక్టర్ కొత్తరఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం(ఎస్‌డబ్ల్యూఈఈపీ) గురువారం నిర్వహించారు. దుగ్గిరాలలో తహసీల్దార్ కార్యాలయం నుంచి శివాలయం సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించిన అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ ఐ.సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈఆర్‌వో లక్ష్మీకుమారి మాట్లాడుతూ ఓటును సద్వినియోగం చేసుకుని సరైన వ్యక్తికి వేసినట్లైతే ఎన్నికల్లో గెలిచిన వారిని తిరిగి ప్రశ్నించే హక్కు ఉంటుందన్నారు. డిగ్రీ పూర్తి చేసిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని, ముందుగా తమ ఓటు నమోదైందో, రిజిస్టర్‌లో ఉందో లేదో తనిఖీ చేసుకోవాలన్నారు. సంబంధిత పోలింగ్‌బూత్ పరిధిలో ఓటువేసే వారందరికీ ఓటరు స్లిప్పులను అందిస్తున్నామన్నారు. ఏ కారణం చేతనైనా ఓటరుస్లిప్పు అందని వారు ముందుగా అధికారులను సంప్రదించవచ్చునన్నారు. నోడల్ అధికారి సంజీవరావు, తహసీల్దార్ సునీత, ఆర్ఐ త్రివేణి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ జవహర్, కళాశాల ప్రిన్సి పాల్ కొత్త గిరిధరరావు, వైస్ ప్రిన్సిపాల్ రాఘవరెడ్డి, కార్యదర్శి వివేకానంద, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దుగ్గిరాల మెయిన్‌రోడ్‌లో ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ అధికారులు,

ఎస్ఆర్ఎంలో నూతన బీకాం కోర్సులు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రుహెబీర్ సింగ్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ యాజమాన్యం గురువారం రెండు నూతన కోర్సుల ను ప్రారంభించింది. సీఏ ఇంటిగ్రేటెడ్ బీకాంతోపాటు ఫిన్‌టెక్ అండ్ బ్యాంకింగ్ సబ్జెక్టులతో కూడిన రెండు బీకాం స్పెషలైజేషన్ కోర్సులను ప్రారం భించింది. అమేయ పేరిట వర్సిటీలో రెండు రోజులపాటు బిజినెస్ ఫెస్ట్ జరుగనుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వర్సిటీలోని పారి బిజినెస్ స్కూల్ బీకాం నూతన కోర్సులను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది. తాత్విక్ గ్లోబల్ ఎనలిటిక్ సంస్థ సీఈవో రుహెబీర్ సింగ్ జ్యోతి ప్రజ్వలన చేసి కోర్సులను ప్రారంభించారు. ఎస్ఆర్ఎం ఉపకులపతి మనోజ్‌కుమార్ అరోరా వర్సిటీ ప్రగతిని వివరించారు. బార్ క్లేస్ బ్యాంక్ ఎండీ బాల అయ్యర్, ఐసీఏఐ బ్యాంకు విజయవాడ శాఖ అధ్యక్షుడు సీఏ రవికిషోర్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. 2025 విద్యా సంవత్సరం నుంచి ఈ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతాయని పారి బిజినెస్ స్కూల్ డీన్ భరద్వాజ్ శివకుమారన్ తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వెబ్ సైటులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీఏ చదవాలనుకునే విద్యార్థులకు సీఏ ఇంటిగ్రేటెడ్ బీకాం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అలాగే, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ రంగాల్లో స్థిరపడాలనుకునే విద్యార్థులకు ఫింటెక్ అండ్ బ్యాంకింగ్ బీకాం మంచి అవకాశమని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎం రిజిస్ట్రార్ ప్రేమ్‌కుమార్, కామర్స్ విభాగాధిపతి ఎ.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతి దిశగా అడుగులు వేయాలి

● యూనియన్ బ్యాంకు ఆర్ఎం జవహర్

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలతో మహిళలు ఆర్థిక పురోగతి దిశగా అడుగులు వేయాలని యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సయ్యద్ జవహర్ తెలిపారు. ప్రత్తిపాడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు రుణ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూపుల ద్వారా మహిళలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు తిరిగి సక్రమంగా చెల్లించాలన్నారు. బ్యాంకు రుణాలు మహిళల ఆర్థిక పురోగతిని పెంచడానికి ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. అలాగే వ్యక్తిగత, వ్యాపార రుణాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు బ్రాంచ్ మేనేజర్ కే సీతారామ్, ఏపీఎం లాజర్, వీవోఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ జవహర్

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : భర్తకు స్టంట్లు పడడంతో అప్పటి నుంచి ఆమె అతనికి తోడుగా మినీ వ్యానులో వెళ్తుంది. అయితే దురదృష్టవశాత్తు భర్త నడుపుతున్న ఆ మినీ వ్యాను వెనుక చక్రాలు అకస్మాత్తుగా ఊడిపోవడంతో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యారు. మంగళగిరి మండలం ఆత్మకూరుకు చెందిన రెడ్డి శ్రీనివాసరావు భార్య పద్మావతి పేరుమీద ఏడాదిన్నర క్రితం ఒక మినీ వ్యాను కొన్నాడు. అతను ఆ వ్యానును నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే అతడికి స్టంట్లు పడడంతో అప్పటి నుంచి భర్తకు తోడుగా పద్మావతి ఆ వ్యానుపైనే వెళ్తుంది. దీనిలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలంలో ఉన్న టైల్స్ ఫ్యాక్టరీకి గురువారం మధ్యాహ్నం వెళ్లారు. అక్కడ టైల్స్‌ను లోడు చేయించుకుని తిరిగి మంగళగిరి వెళ్తున్నారు. 16వ నెంబర్ జాతీయ రహదారిపై వెళ్తుండగా మార్గమధ్యలో ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ సోమవరప్పాడు బ్రిడ్జి డౌన్‌లో అతి వేగంగా వెళ్తున్న ఆ వాహనానికి వెనుక ఉన్న చక్రాలు ఊడిపోయాయి. పక్కన ఉన్న రెయిలింగ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరు తీవ్ర గాయా లకు గురయ్యారు. టైల్స్ అన్ని రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు హుటాహుటిన వెళ్లి క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏలూరు రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

పేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలని వినతి

మంగళగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నివాసయోగ్యమైన ప్రాంతాల్లో పేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం లబ్ధిదారులతో కలిసి 19వ సచివాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ పేదలకు ఇంటి స్థలంతోపాటు నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొన్ని సంవత్సరాలుగా అనేక ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు, సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, నేతలు చిన్ని సత్యనారాయణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో కలిసి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

అగ్రిగోల్డ్ బాధితులకు బడ్జెట్ కేటాయించాలి

● ఎమ్మెల్యేకు విజ్ఞాపన



తెనాలి శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అగ్రిగోల్డ్ బాధిత సంఘ నాయకులు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులకు బడ్జెట్ కేటాయించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్ అన్నారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, భాష్యం ప్రవీణ్‌లకు వినతిపత్రం అందజేశారు. అనంతరం అగస్టీన్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. లక్షలోపు డిపాజిట్ చేసిన చిన్న పొదుపుదారులకు తక్షణ చెల్లింపులు చేయాలన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో అగ్రిగోల్డ్ బాధితుల విషయంపై చర్చించి సత్వర న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కోటా మాల్యాద్రి, పెద రామయ్య, సాంబశివరావు, ప్రసాద్‌బాబు, ఇన్నయ్య తదితరులు ఉన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం



ఆలపాటికి మద్దతుగా ప్రచారం చేస్తున్న టీడీపీ శ్రేణులు

మంగళగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ గురువారం మంగళగిరి పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో తెలుగుమహిళ రాష్ట్ర కార్యదర్శి వింజమూరి ఆషాబాల, కొల్లి వేణు, కొల్లి శివాజీ, వెనిగళ్ల హనుమంతరావు, జ్యోతి, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవనగర్‌లో ఆలపాటికి మద్దతుగా ప్రచారం

దుగ్గిరాల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ స్థానిక టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం, ఉద్యోగుల ఔన్నత్యాన్ని కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్సీ బరిలో నిలబెట్టిన ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కరపత్రాలను అందిస్తూ, ప్రచారం కొనసాగించారు. దుగ్గిరాలలోని చెన్నకేశవనగర్‌లో గురువారం జరిగిన ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర టీడీపీ వాణిజ్య విభాగం ప్రధానకార్యదర్శి గూడూరు వెంకట్రావు, టీఎన్‌యూఎస్ అధ్యక్షుడు వల్లూరు నరసింహారావు, దేవరపల్లి చంటి పర్వతనేని హర్షవర్ధన్, ఎద్దు ప్రసాద్, నక్కా చిరంజీవి పాల్గొన్నారు.

చేనేతకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

● చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి



సమావేశంలో మాట్లాడుతున్న పిల్లలమర్రి నాగేశ్వరరావు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఈ నెల 25వ తేదీన ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు కోరారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌లో చేనేతకు కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. 1.65 లక్షల మంది ప్రత్యక్షంగా, 3 లక్షల మంది పరోక్షంగా చేనేతపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. చేనేత సహకార సంఘాల బకా యిలు రూ.172 కోట్లు వెంటనే విడుదల చేయాలని, సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, నేతన్న నేస్తం రూ.24 వేల నుంచి రూ.36 వేలకు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో చేనేతకు నిధులు పెంచాలని కోరుతూ ఈ నెల 24న అన్ని జిల్లా కేంద్రాల్లో చేనేత జౌళిశాఖ ఏడీలకు వినతిపత్రాలు ఇస్తామన్నారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గుజవల్లి వెంకటకృష్ణారావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా లక్ష్మణరావు గెలుపు కోరుతూ ప్రచారం



మోరంపూడిలో ఎన్నికల ప్రచారంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

దుగ్గిరాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పీడీఎఫ్ తరపున ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. మోరంపూడిలో గురువారం సాయంత్రం జరిగిన ప్రచారంలో, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, రైతు సంఘం మండల కార్యదర్శి వై బ్రహ్మేశ్వరరావు, జీ నాగేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొండవీటి వాగులో దట్టంగా తూటుకాడ



లాంలోని కొండవీటి వాగు కాల్వలో పెరిగిన తూటుకాడ

తాడికొండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కొండవీటి వాగులో తూటుకాడ దట్టంగా పెరిగి నీటి ప్రవాహానికి అడ్డుగా మారింది. లాం చప్టా వద్ద ఉన్న కాల్వ, చెరువులో తూటుకాడ దట్టంగా పెరిగింది. వర్షాకాలంలో వరద నీటికి ప్రవాహానికి సక్రమంగా పారుదల లేకపోవటం వల్ల పంట పొలాల్లోకి వరద నీరు చేరుతుంది. నాగార్జునసాగర్ కాల్వ నీరు విడుదల సమయంలో నీటి ప్రవాహానికి కాల్వల్లో అడ్డుగా తూటుకాడ ఉన్నది. నీటి ప్రవాహం తగ్గడంతో చివరి భూములకు నీరందని పరిస్థితి ఉంది. దీంతో పంటలకు నీరు సక్రమంగా అందటం లేదని రైతులు వాపోతున్నారు. లాం చప్టాకు రెండు వైపుల తూటుకాడ దట్టంగా పెరిగి ఉన్నది. నీటి ప్రవాహం కూడా తక్కువగా ఉండటం వల్ల తాడికొండ వైపు వచ్చే నీరు సక్రమంగా అందట్లేదని రైతులు వాపోతున్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

గ్రూపు-2 మెయిన్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్-2 సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా కొనసాగేలా లైజన్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరలో ఆమె జేసీ ఏ భార్గవతేజతో కలిసి ఏపీపీఎస్సీ గ్రూప్-2 సర్వీసెస్ మెయిన్స్ పరీక్షల నిర్వహణపై లైజన్ అఫీసర్లు, చీఫ్ సూపరింటెంటెంట్‌లు, ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 11 పరీక్ష కేంద్రాలకు 11మంది సీనియర్ జిల్లా అధికారులను లైజను ఆఫీసర్లుగా నియమించటం జరిగిందన్నారు. లైజన్ అధికారులు ముందస్తుగానే వారికి కేటాయించిన కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించుకొని, చీఫ్ సూపరింటెండ్‌లతో కలిసి ఇన్విజలేటర్లుకు పరీక్షల నిర్వహణపై ఏపీపీఎస్సీ జారీచేసిన మార్గదర్శకాలపై అవగాహన కల్పించటానికి ప్రత్యేక సమావేశం నిర్వహించాలన్నారు. లైజన్ ఆఫీసర్లు పరీక్ష నిర్వహణకు సంబంధించి నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ పరీక్ష ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు పర్యవేక్షించాలన్నారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష వేళలకు అనుగుణంగా కేంద్రాలకు బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపుల ఏర్పాటుకు వైద్యఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణలో మానవ తప్పిదాలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెంట్‌లు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో ఖాజావలి, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ వెంకటలక్ష్మి, లైజన్ అధికారులుగా నియమించిన జిల్లా అధికారులు, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి

సబ్ కలెక్టర్ సంజనా సింహ


సమావేశంలో మాట్లాడుతన్న సబ్ కలెక్టర్ సంజనా సింహ

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాలలో సామాన్య భక్తులకు దైవ దర్శనం కలిగేలా ప్రాధాన్యం ఇవ్వాలని సబ్ కలెక్టర్ సంజనా సింహ ఆదేశించారు. వడ్లమూడి క్వారీ బాల కోటేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం ఉత్సవాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లపై ఆరా తీశారు. ప్రధానంగా సామాన్య భక్తులు ఆలయం వద్దకు సులువుగా చేరుకునేలా బారికేడ్‌లు కట్టాలని ఆదేశించారు. ఓ వీఐపీ భక్తుడు స్వామిని దర్శించుకునే సమయంలో పదిమంది సామాన్య భక్తులు స్వామివారిని దర్శించుకునేలా ఏరాట్లు చేయాలని ఆదేశించారు. సామాన్యుల దర్శనాలకు అవాంతరాలు కలగడానికి వీలులేదని ఆదేశించారు. ప్రభల నిర్వాహకులను పిలిపించి నిర్వహణపై సూచనలు ఇవ్వాలని పోలీస్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభల రాకపోకలకు ఎటువంటి అవాంతరాలు ఉండడానికి వీలులేదని అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే వాహన పార్కింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రధాన రహదారిపై ఆలయం ఉన్నందున ట్రాఫిక్ మళ్లింపు చర్యలు ప్రత్యామ్నాయ మార్గాలను ప్రజలకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో వ్యవహరించి శివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా జరిగేలా కృషి చేయాలన్నారు. ఉత్సవ ఏర్పాట్లును పర్యవేక్షించే అధికారులు ఎప్పటికప్పుడు తమకు సమగ్ర సమాచారం అందించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించండి

మునిసిపల్ కమిషనర్ శేషన్న


సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న పారిశుధ్య కార్మికులకు సూచించారు. పురపాలక సంఘం పరిధిలోని 4వ డివిజన్‌లో గురువారం జరుగుతున్న శానిటేషన్ పనులను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మురుగు కాలువల లోని వ్యర్థాలను గమనించి పారిశుధ్య కార్మికులకు పలు ఆదేశాలు ఇచ్చారు. డ్రెయిన్‌ల నుంచి వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని, తొలగించిన వ్యర్థాలను చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో అలసత్వంవహిస్తే సహించనని శాఖా పరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలు చెత్తను వ్యర్థాలను మురుగు కాలువలలో వేయరాదన్నారు. మురుగునీటి పారుదల నిలిచిపోతుందని అపరిశుభ్రవాతావరణం ఏర్పడి దోమలు పెరుగుతాయన్నారు. ఇంటి నుంచి వచ్చే వ్యర్థాలను మూడు బుట్టల విధానంలో వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. పురపాలక సంఘానికి చెల్లించవలసిన ఇంటి, నీటి, ఖాళీ స్థలాల పన్నులను సకాలంలో చెల్లించాలని కోరారు. షాపు యజమానులు ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేయించుకోవాలని పిలుపునిచ్చారు. పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించి సుందర తెనాలి నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై గ్రామాల్లోనూ విస్తృత ప్రచారం చేయాలి

మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు ఎమ్మెల్సీ పోలింగ్ తేదీ దగ్గర పడుతున్నందున టీడీపీ శ్రేణులు గ్రామాలలోనూ విస్తృత ప్రచారం చేయాలని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. పొన్నూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం మండలంలోని 29 గ్రామాల క్లస్టర్, యూనిట్, పట్టణంలోని నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దేవినేని మాట్లాడుతూ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పిలుపు మేరకు పార్టీ శ్రేణులు పని చేయాలన్నారు. కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ, మండలంలోని పట్టభద్ర ఓటర్లును ప్రత్యేకంగా కలిసి ఓటు అభ్యర్థించాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మిర్చి యార్డు మాజీచైర్మన్ మన్నవ సుబ్బారావు, స్థానిక టీడీపీ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు, గనిపిశెట్టి రామకృష్ణ, పట్టణ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెనాలిలో ప్రచారం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయం కాంక్షిస్తూ పట్టణంలో గురువారం విస్తృత ప్రచారం చేశారు. వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో ఓటు హక్కు వినియోగంపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ మాట్లాడుతూ, ప్రైవేట్ విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఆయన నాయకత్వం ఎంతైనా అవసరమన్నారు. కళాశాల సిబ్బంది, అధ్యాపకులకు ఓటు హక్కు వినియోగించే విధానాన్ని వివరించారు. 7వ వార్డులో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటు హక్కు ఉన్న వారికి స్లిప్పులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, జిలానీ, పఠాన్, సోమశేఖరరావు, శివ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న సుధాకర్ తదితరులు

● తెనాలి రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి కృష్ణా, గుంటూరు జిల్లాల అభ్యర్థిగా పోటీచేస్తున్న మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించుకుందామని కొలకలూరు కూటమి నాయకులు గురువారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో గుంటూరు కృష్ణమోహన్, నల్లిపోయిన నాగేశ్వరరావు, జిలాని, తాళ్లూరు బుజ్జి, నాని, తుపాకుల గోపి, అజిత్, కృష్ణ, ఎస్.కృష్ణ, లక్ష్మి, శిరీష, సీహెచ్. వెంకటేశ్వర్లు పలువురు కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్: కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు పట్టభద్రులైన ఓటర్లందరూ ప్రథమ ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని అంగలకుదురులో కూటమి నాయకులు, కార్యకర్తలు, తెలుగుమహిళలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రాజ్యలక్ష్మి, టీడీపీ పార్టీ గ్రామ ప్రెసిడెంట్ శ్రీనివాస్, బీజేపీ మండల ప్రెసిడెంట్ కడియాల నంద కిషోర్, మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, మాజీ గ్రామ సర్పంచ్ నలుకుర్తి విజయమ్మ, చెన్నుపాటి ప్రసాదరావు, గడ్డే శ్రీనివాస్, బీజేపీ మండల మోర్చా అధ్యక్షుడు మానుబోతుల వీరయ్య, ఆలపాటి సుబ్బయ్య, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపరలో..

కొల్లిపర, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి ప్రచారం నిర్వహించారు. గురువారం మండల పరిధిలోని తూములూరు, వల్లభాపురం గ్రామాల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం టీడీపీ, జనసేన నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దుగ్గిరాల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, నీటి సంఘ ఉపాధ్యక్షుడు ఆరిమండ శివనాగమల్లేశ్వరరెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, అడపా నారాయణరెడ్డి, కొల్లి కోటిరెడ్డి, వింతా శ్రీనివాసరెడ్డి, షేక్ రఫీ, చాగంటి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

గుంటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అశ్విని లాడ్జిలో తెనాలికి చెందిన వి.రవితేజ (32) అని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడు రోజుల క్రితం గది అద్దెకు తీసుకున్నాడు. రెండు రోజులుగా గది నుంచి బయటకు రాకపోవడంతో గురువారం లాడ్జి సిబ్బంది పరిశీలించగా, రూం నుంచి వాసన వస్తుండడంతో గదిలోపలికి వెళ్లి పరిశీలించగా పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరోనా సమయంలో ఆయన అక్క మృతి చెందినట్లు తెలిసింది. అంతేకాకుండా కొంతమేరకు అప్పులు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడు రవితేజకు భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

75 మంది డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గుప్తా డిగ్రీ కళాశాల, చంద్రకళ పీజీ కళాశాల విద్యార్థులకు గురువారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన టెక్స్‌కాన్ కంపెనీ, క్వెస్ కంపెనీ, విజయ బయోఫెర్టిలైజర్స్ సంస్థలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ దశల్లో జరిగిన పరీక్షలు, ఇంటర్వ్యూలకు 200మంది విద్యార్థులు హాజరు కాగా, 75మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. మరో 8 మంది విద్యార్థులు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు, ముత్తూట్ ఫైనాన్స్ వంటి సంస్థల ఇంటర్వ్యూలలో మొదటి దశ పూర్తిచేసి రెండో రౌండ్ పరీక్షలకు అర్హత సాధించారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కమిటీ ప్రతినిధి నంబూరి నరేంద్ర అభినందించారు. ప్రిన్సిపాల్ విజయకృష్ణ, నరేష్, అధ్యాపకులు నాగరాజు, కోటేశ్వరరావు, దశరథ రామిరెడ్డి, షారోన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా విద్యను అందించాలి

● ఎంఈవో సాల్మన్‌రాజు

కొల్లిపర, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా విద్యను అందించాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని తూములూరు, సుగాలీకాలనీ, కొల్లిపర ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ నిర్వహించారు. పాఠశాలల్లో రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టీలను పరిశీలించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రతి నెల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల పురోగతిని వారికి తెలియజేయాలన్నారు. మధ్యాహ్నభోజన పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పాఠశాలలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 1716 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1716 క్యూసెక్కుల సాగునీటిని గురువారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 11.9 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 202 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వకు 176 క్యూసెక్కుల నీరు, పశ్చిమ కాల్వకు 70 క్యూసెక్కుల నీరు, నిజాంపట్నం కాల్వకు 80 క్యూసెక్కుల నీరు, కొమ్మమూరు కాల్వకు 746 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

నిషేధిత ప్లాస్టిక్ గ్లాసులను, క్యారీ బ్యాగులను విక్రయించొద్దు

● మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ గ్లాసులను, క్యారీ బ్యాగులను విక్రయించరాదని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. గురువారం పట్టణంలోని కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మలతో కలసి వర్తక వ్యాపార సంస్థల ప్రతినిధిలతో నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నందున దీనిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను ఎట్టిపరిస్థితులలో వినియోగించకూడదన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని వ్యాపారులను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రం ఉదయశంకర్, ప్రధాన కార్యదర్శి కొప్పరావూరు కిషోర్, వీరభద్రయ్య, గునుగుంట్ల శ్రీనివాసరావు, మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఐడీపీ ఎడ్యుకేషన్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న వీవీఐటీ ప్రతినిధులు

ఐడీపీ ఎడ్యుకేషన్‌తో వీవీఐటీ అవగాహన

పెదకాకాని, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు విదేశాలలో చదువుకోవాలనే ఆకాంక్షలను సాకారం చేసేందుకు అంతర్జాతీయ విద్యాసేవలలో ప్రత్యేకత కలిగిన ప్రముఖ ఆస్ట్రేలియన్ లిస్టెడ్ సంస్థ ఐడీపీ ఎడ్యుకేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ గురువారం తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు అంతర్జాతీయ విద్యపై సమగ్ర అవగాహన, ప్రక్రియ, ముందస్తు ప్రణాళికపై మార్గనిర్దేశంతోపాటు కోర్సు ఎంపిక, వీసా పొందడం వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. ఐఈఎల్‌టీఎస్ వంటి అంతర్జాతీయ వీసా ప్రవేశ పలితాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఐడీపీ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ అందిస్తుందని తెలిపారు. విద్యార్థులకు ఐఈఎల్‌ఎస్ వంటి ప్రవేశ పరీక్షలలో ఫీజు రాయితీ, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం మాక్ టెస్టులు, మెటీరియల్స్, అధ్యాపకులకు ప్రొఫెషనల్ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ సూర్యదేవర బదరీప్రసాద్, జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ, ఐడీపీ ఎడ్యుకేషన్ ప్రతినిధులు హాజరయ్యారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

● ఎంఈవో సాల్మన్‌రాజు


అవగాహన సదస్సులో పాల్గొన్న ఎంఈవో సాల్మన్‌రాజు

కొల్లిపర, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై ఐసీడీఎస్ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. బాల్య వివాహాలు చేయడం వలన అనేక అనర్ధాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఆడ పిల్లలు మగ పిల్లలతో సమానంగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఆడ పిల్లలు చదువుకోవడం వలన ఆ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యామిని, రాధిక, ఆర్‌పీలు మృత్యుంజయరావు, రాధిక, శ్రీలత, సీఆర్పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు న్యాయవాదుల గైర్హాజరు


కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు


తెనాలి క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): న్యాయవాద వృత్తికి ఉన్న స్వేచ్ఛను హరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న సవరణలు 2025కు నిరసనగా గురువారం పట్టణ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు విధులకు గైర్హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఈ అమెండ్‌మెంట్ యాక్టులోని సెక్షన్ 4, 9బి, 24ఎ, 24బి, 26ఎ, 35ఎ, 45బి, 49ఎలను న్యాయవాద వృత్తికి ఉన్న స్వేచ్ఛను హరించేలా ఉన్నాయని, ఇది కేంద్ర ప్రభుత్వ తొందరపాటు చర్యగా విమర్శించారు. నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బేతాళ ప్రభాకర్, హరిదాసు గౌరీశంకర్, టి.శ్రీనివాసరావు, పీఆర్‌వీ సాగర్, పిల్లి సుధాకర్, చిట్టాల మైఖేల్, చింకా సురేష్ చంద్రయాదవ్, ఎస్.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాలను సద్వినియోగం చేసుకోండి

● జిల్లా యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ హరి శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న హరిశ్రీనివాస్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు బ్యాంక్ ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ జిల్లా చీఫ్ మేనేజర్ హరి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని సంగంజాగర్లమూడిలో డ్వాక్రా మహిళలతో యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ హరిశ్రీనివాస్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బ్యాంక్ ద్వారా రుణాలు పొంది సద్వినియోగం చేసుకుంటున్న విధానాన్ని అడిగితెలుసుకున్నారు. డ్వాక్రా మహిళలకు అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. బ్యాంక్ సేవలపై వారికి వివరించారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ కిషోర్, గ్రూఫ్ సభ్యులు, బ్యాంక్ సిబ్బంది యానిమేటర్లు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభ చూపిన విద్యార్థి పవన్‌ను అభినందిస్తున్న మంత్రి మనోహర్

చదువుకు అవసరమైన సాయం అందిస్తా

● జేఈఈ మెయిన్స్ ర్యాంకర్‌కు మంత్రి మనోహర్ హామీ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు అవసరమైన సాయం అందిస్తామని జేఈఈ మెయిన్స్ ర్యాంకర్ తూనుగుంట్ల వెంకట్‌పవన్‌కుమార్‌కు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. వివేక జూనియర్ కళాశాలలో చదువుతున్న పవన్‌తో పాటు కళాశాల డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ, ఈడీ రామరాజు, సీఈవో ఉదయ్‌కిరణ్‌లతో కలిసి గురువారం క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిశారు. మెయిన్స్‌లో 99.37 పర్సంటైల్ సాధించిన పవన్‌ను అభినందించారు. ఇదేస్ఫూర్తి కొనసాగించి అనుకున్న స్థాయికి చేరాలని ప్రోత్సహించారు. ఇస్రో శాస్త్రవేత్తగా ఎదగాలని తన కోరికకు ప్రణాళిక రూపొందించి ముందుకు సాగాలని, ఎక్కడా అధైర్యపడకుండా ఉండాలని, అవసరమైతే తాము కూడా తోడ్పాటు అందిస్తామని భరోసా కల్పించారు.


హ్యాండ్‌బాల్ పోటీల్లో విజేతలతో అధ్యాపకులు

హ్యాండ్‌బాల్ పోటీల్లో విజేత జేఎంజే కళాశాల

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నాగార్జున యూనివర్శిటీ అంతర కళాశాలల హ్యాండ్ బాల్ పోటీలలో జేఎంజే కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఏఎస్ఎన్ కళాశాల ద్వితీయ స్థానం, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల తృతీయ స్థానంలో నిలిచాయి. పట్టణంలోని జేఎంజే కళాశాలలో నిర్వహిస్తున్న పోటీలు గురువారం ముగిశాయి. విజేతలకు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్ ట్రోఫీలు, పతకాలు అందజేశారు. కోచ్ నాగరాజు, వెంకటేశ్వరరావు, వేళంగిణిరెడ్డి, సుశీలమ్మ, నాగమల్లేశ్వరరావు, ప్రిన్సిపాల్ షైనీ, అరుణసుజాత పాల్గొన్నారు.


లక్ష్మణరావు గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తున్న సీఐటీయూ, రైతు సంఘ నాయకులు

లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్య ఓటు వేయాలి

● ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు శివసాంబిరెడ్డి

కొల్లిపర, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపరలో లక్ష్మణరావు గెలుపుకోసం సీఐటీయూ, రైతు సంఘ నాయకులు ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను, ఉద్యోగులను కలిసి లక్ష్మణరావుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ నిజాయితీ గల వ్యక్తి లక్ష్మణరావు అని అటువంటి వ్యక్తిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. లక్ష్మణరావును గెలిపించినట్లు అయితే పాఠశాలలకు, ఉపాధ్యాయులకు ఉన్న సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కోటా చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, ఎ. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.